# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 1 సంచిక :280 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తిరుపతి శుక్రవారం 16 అక్టోబర్ 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE :280 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : TIRUPATI FRI 16 OCTOBER 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur


## హర్మ్యూజ్‌లో కుప్పలుగా తేలియాడుతున్న ఐఫోన్లు



హర్మ్యూజ్ జలసంధిలో ఓ కార్గో నౌక ( మునిగిపోయింది. సీమైన్‌ను ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసు కున్నట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్ వెల్లడించింది. అయితే, మైన్‌ను ఢీకొట్టి నౌక మునిగిపోయినట్లుగా ఐఆర్‌జీసీ ప్రకటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

- మిగతా 2లో





## కుప్పకూలిన పాఠశాల పైకప్పు.. 34 మంది విద్యార్థులు మృతి

పాకిస్థాన్ లో విషాద ఘటన చోటుచేసుకుంది. ఓ ప్రైవేటు పాఠశాల పైకప్పు కూలి 34 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో అత్యధికులు 13 ఏళ్ల లోపు వయసున్న విద్యార్థులే కావడం విషాదకరం. పెషావర్ లో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది

- మిగతా 2లో

## భారత్ వైర్‌లెస్ డేటాలో 60 శాతం మాదే

- అక్టోబర్ 21 నుంచి 23 వరకు జియో ప్లాట్‌ఫామ్స్ మెగా ఐపీఓ
- కంపెనీకి 53.3 కోట్ల మంది కస్టమర్లు, అందులో 28.5 కోట్ల మంది 5జీ యూజర్లు
- రూ.30,213 కోట్లు సమీకరించడమే లక్ష్యంగా ఐపీఓ ఇష్యూ
- భారత్‌ను అతిపెద్ద డిజిటల్ సొసైటీగా మార్చడమే లక్ష్యమన్న జియో

- మిగతా 2లో



## సంక్షేమం నుంచి స్వావలంబన దిశగా..

# ఇదే మా విధానం

- విజయవాడలో జాతీయ సరస్ మేళాను ప్రారంభించిన రాష్ట్రపతి ముర్ము, సీఎం చంద్రబాబు
- గ్రామీణ మహిళల ఉత్పత్తుల కోసం 'స్వయం ఏపీ' బ్రాండ్ ఆవిష్కరణ
- మహిళలను సంపద సృష్టికర్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్న చంద్రబాబు
- రాబోయే ఐదేళ్లలో మరో 5 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తల తయారీకి ప్రణాళిక
- ప్రతి గ్రామాన్ని ఉపాధి కేంద్రంగా మార్చడమే ధ్యేయమని స్పష్టీకరణ



మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా పరిమితం చేయకుండా, వారిని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఆర్థిక స్వావలంబన దిశగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన విధానమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మహిళలు ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని, సంపద సృష్టికర్తలుగా మారాలని ఆయన ఆకాంక్షించారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా, గ్రామీణ మహిళల నైపుణ్యాలకు, ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో వేదిక కల్పిస్తున్న జాతీయ సరస్ మేళా-2026ను విజయవాడలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి ఆయన గురువారం లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గ్రామీణ మహిళలు తయారుచేసే ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేందుకు 'స్వయం ఏపీ' బ్రాండ్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించారు. దసరా శరన్నవరాత్రుల వేళ ఇంద్రకీలాద్రి సాక్షిగా ఈ మేళా నిర్వహించడం నగరానికి మరింత శోభను తెచ్చిందన్నారు. మారుమూల గిరిజన ప్రాంతంలో జన్మించి, ఎన్నో సవాళ్లను అధిగమించి దేశ అత్యున్నత పదవిని అలంకరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం ప్రతి ఆడబిడ్డకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.



- మిగతా 2లో



## మున్సిపల్ పోరుకు వైసీపీ అభ్యర్థులు ఖరారు..

### మేయర్, ఛైర్మన్ అభ్యర్థుల పూర్తి జాబితా విడుదల

- మేయర్లు, ఛైర్మన్ల పూర్తి జాబితాను విడుదల చేసిన వైసీపీ అధిష్ఠానం
- వైఎస్ జగన్ ఆమోదంతో తాడేపల్లి కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన
- జాబితాలో మహిళలు, బీసీ, ఎస్సీ వర్గాలకు గణనీయమైన ప్రాధాన్యం
- 7 కార్పొరేషన్లు, 14 మున్సిపాలిటీలు, 6 నగర పంచాయతీలకు అభ్యర్థుల పేర్లు వెల్లడి

ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న మున్సిపల్ ఎన్నికల సమరానికి వైసీపీ పూర్తిస్థాయిలో సిద్ధమైంది. పార్టీ అధ్యక్షుడు జగన్ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్పొరేషన్లకు మేయర్ అభ్యర్థులను, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు ఛైర్మన్ అభ్యర్థులను ఖరారు చేశారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం అధికారికంగా పత్రికా ప్రకటన ద్వారా అభ్యర్థుల పూర్తి జాబితాను విడుదల చేసింది.

- మిగతా 2లో



## విచ్ఛిన్నకర శక్తులతో జగన్ చేతులు కలిపారు

అమరావతి: కేసులు ఎదుర్కొంటున్న జగన్‌తో చేతులు కలపడం ద్వారా కాక్రోచ్ జనతా పార్టీ అజెండా ఏంటో స్పష్టమైందని భాజపా ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఎద్దేవా చేశారు. "నాడు ఆలయాల ఆస్తుల ఆక్రమణ, మత మార్పిడులను

- మిగతా 2లో

## సీట్ల సర్దుబాటు అంశం.. చంద్రబాబుతో మంత్రుల చర్చలు

ఉండవల్లి: పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఐక్యంగా పోటీ చేయాలని నిర్ణయించిన కూటమి నేతలు.. ఎవరు, ఎక్కడ బరిలోకి దిగాలన్న అంశంపై



- మిగతా 2లో

## విజయవాడ దుర్గమ్మకు రూ.75 లక్షల విలువైన స్వర్ణ కిరీటం విరాళం

- శ్రీకాకుళం జిల్లాకు చెందిన భక్తుడు దుర్గా శ్రీనివాస్ సమర్పణ
- 494 గ్రాముల బంగారంతో నవరత్నాలతో కిరీటం తయారీ
- దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ ఈ కానుక అందజేత

- మిగతా 2లో



## దేశంలో 4 కొత్త రైళ్లు, 3 పొడిగింపులు..

# 12 కొత్త హాల్టులు

- దేశవ్యాప్తంగా 4 కొత్త రైలు సర్వీసులకు రైల్వే బోర్డు ఆమోదం
- ప్రయాణికుల సౌలభ్యం కోసం 3 రైళ్లను పొడిగించాలని నిర్ణయం
- మరో 12 ముఖ్యమైన రైళ్లకు కొత్తగా హాల్టింగ్ స్టేషన్ల ఏర్పాటు
- త్వరలో తేదీలను ప్రకటించనున్న సంబంధిత రైల్వే జోన్లు

- మిగతా 2లో






## నారాయణపేటలో దారుణం

### పెట్రోల్ పోసి భర్తను సజీవ దహనం చేసిన భార్య

- వివాహేతర సంబంధం నేపథ్యంలో భర్తను హత్య చేసిన భార్య
- నారాయణపేట జిల్లా మరికల్ మండలంలో జరిగిన దారుణ ఘటన
- నిద్రిస్తున్న భర్తపై పెట్రోల్ పోసి నిప్పంటించి దాడి
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బాధితుడు మృతి
- నేరం అంగీకరించిన నిందితురాలు.. కేసు నమోదు చేసిన పోలీసులు

- మిగతా 2లో

## సీఈసీని రక్షించేందుకే ఇదంతా

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వంపై 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) నేత అభిజిత్ దీప్కే సంచలన ఆరోపణలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను రక్షించేందుకు ప్రధాని మోదీ ప్రభుత్వ వనరులను వాడుకుంటున్నారని ఆయన విమర్శించారు. సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తున్న ప్రతిపక్ష నేతలు, నిరసనకారులను ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుంటోందని గురువారం



- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను రక్షించేందుకు మోదీ సర్కార్ ప్రయత్నిస్తోందని సీజేపీ ఆరోపణ
- ఎన్నికల జాబితా నుంచి 13 కోట్ల ఓట్లు తొలగించారని అభిజిత్ దీప్కే విమర్శ
- ప్రభుత్వానిది 'ఒకే దేశం, ఒకే పార్టీ' నినాదమని విమర్శలు
- నటుడు ప్రకాశ్ రాజ్, ఇతర నేతలతో కలిసి దీప్కే మీడియా సమావేశం

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# వ్యూహం ఉత్తుత్తిదేనా.. మళ్లీ సేనలో అదే రిపీట్ అవుతుందట

జనసేన అధినేత పవన్ కల్యాణ్ కు నాయకత్వాన్ని పెంపొందించుకు నే పనిలో కన్నా టీడీపీ నేతలకు కండువాలు కప్పడం చర్చనీయాంశంగా మారింది. తాజాగా జనసేన పార్టీలోకి టీడీపీ నేత వంగవీటి రాధాకృష్ణ చేరారు. పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరిన వంగవీటి రాధాకృష్ణను సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ కండువా కప్పి పవన్ కల్యాణ్ వంగవీటి రాధా కృష్ణను జనసేన పార్టీలోకి పవన్ ఆహ్వానించారు. వంగవీటి రాధాకృష్ణతో పాటు జనసేన పార్టీలో చేరిన తిరుపతికి చెందిన ప్రణీత్ ప్రమోద్ కు చేరారు. జనసేన నుంచి విజయవాడ మేయర్ అభ్యర్థిగా వంగవీటి రాధాకృష్ణ పేరు వినిపిస్తుండటంతో ఆయన జనసేనలో చేరడం చర్చనీయాంశంగా మారింది. అలాగే తిరుపతి మేయర్ అభ్యర్థిగా ప్రణీత్ ప్రమోద్ పేరు కూడా వినిపిస్తుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ పవన్ కల్యాణ్ ఇదే రకమైన వ్యూహాన్ని అనుసరించారు. తిరిగి స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఇదే స్ట్రాటజీనా? అంటూ జనసైనికులే పెదవి విరుస్తున్నారు.

**పలు దఫాలు చర్చలు జరిపినా...**

ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కూటమి పార్టీలైన టీడీపీ, జనసేనల మధ్య సీట్ల సర్దుబాటు మరియు రాజకీయ వ్యూహాలపై విస్తృత చర్చ జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించిన విజయవంతమైన పొత్తు ఫార్ములానే ఇక్కడ కూడా కొనసాగించాలని భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడు అమరావతిలో సుదీర్ఘంగా సమావేశమయ్యారు. ఈ చర్చల్లో భాగంగా జనసేన పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ఆరు కార్పొరేషన్లలో మేయర్ పదవి, అలాగే 26 మున్సిపాలిటీలను తమకు కేటాయించాలని కోరుతున్నట్లు సమాచారం. గత ఎన్నికలకు ముందు కూడా ఎమ్మెల్యే అభ్యర్థులను టీడీపీ నుంచి వైసీపీ నుంచి పార్టీలోకి చేర్చుకుని వారికి టిక్కెట్లు ఇవ్వడంతో ఇప్పుడు అసలైన జనసేన కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందన్న భావన వ్యక్తమవుతుంది.

**అత్యధిక మంది టీడీపీ వారే...**

జనసేన ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇంత మంది ఉన్నా వారిలో అత్యధిక మంది టీడీపీకి చెందిన వారేనని, ఇక చంద్రబాబు తాను సీట్లు ఇవ్వలేని వారిని జనసేనలోకి పంపి అక్కడ సీట్లు దక్కేలా చేస్తున్నారని జనసేన నేతలు సోషల్ మీడియాలో వాపోతున్నారు. దీనివల్ల వాస్తవంగా పార్టీ కోసం నిబద్ధతగా పనిచేసిన నేతలకు అన్యాయం జరుగుతుందని, ఇదే స్ట్రాటజీని తిరిగి స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అనుసరించడంపైన కూడా కొంత వ్యతిరేకత వ్యక్తమవుతుంది. అయితే గెలుపు గుర్రాలనే ఎంపిక చేస్తున్నామని జనసేన నాయకత్వం చెప్పుకుంటుంది. గెలుపు గుర్రాల ఎంపిక, కొన్ని స్థానాల్లో స్థానిక సమీకరణాల దృష్ట్యా సమర్థులైన నేతలను బరిలోకి దించేందుకు ఇరు పార్టీల మధ్య సమన్వయ కమిటీలు కూడా పనిచేయనున్నాయి. ఈ క్రమంలోనే అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే సమర్థత ఆధారంగా సీట్ల కేటాయింపు జరగవచ్చని తెలుస్తోంది. ఈ స్థానిక సంస్థల ఎన్నికల సీట్ల సర్దుబాటు వ్యవహారం లో అగ్రనేతలు కలసి ఉన్నట్లు చేతులు కలిపినా కింది స్థాయిలో ఓట్ల బదిలీ అనేది జరగకపోవచ్చన్న అభిప్రాయం బలంగా వినపడుతుంది.

## భారత్ వైర్‌లెస్ డేటాలో 60 శాతం మాదే

రిలయన్స్ జియో ప్లాట్‌ఫామ్స్ తన మెగా ఐపీఓకు రంగం సిద్ధం చేసింది. ఈ నెల అక్టోబర్ 21 నుంచి 23 వరకు ఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ప్రక్రియ కొనసాగనుంది. ఈ సందర్భంగా ముంబైలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ఆకాశ్ అంబానీ మాట్లాడుతూ, జియో సాధించిన ప్రగతిని, భవిష్యత్ లక్ష్యాలను వివరించారు. దేశవ్యాప్త వైర్‌లెస్ డేటా ట్రాఫిక్‌లో 60 శాతానికి పైగా వాటాను జియో నెట్‌వర్క్ దక్కించుకుందని ఆయన వెల్లడించారు. 2026 జూన్ 30 నాటికి జియో వినియోగదారుల సంఖ్య 53.3 కోట్లకు చేరిందని, వీరిలో 28.5 కోట్ల మంది 5జీ వినియోగదారులేనని ఆకాశ్ అంబానీ తెలిపారు. చైనా మినహా ప్రపంచంలోనే ఇంతటి భారీ కస్టమర్ బేస్ కలిగిన ఏకైక సంస్థగా జియో నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఒక్కో వినియోగదారుడి సగటు నెలవారీ డేటా వినియోగం 43.7 జీబీకి పెరిగిందని, ఇది దేశంలో మారుతున్న డిజిటల్ అవసరాలకు నిదర్శనమని వివరించారు. 2016లో జియో సేవలు ప్రారంభమైన సమయంలో దేశంలో సగటు ఇంటర్నెట్ డౌన్‌లోడ్ వేగం కేవలం 2.5 ఎంబీపీఎస్‌గా ఉండగా, ఇప్పుడు అది 68 ఎంబీపీఎస్‌కి పెరిగిందని ఆయన గుర్తుచేశారు. జియో 5జీ సగటు డౌన్‌లోడ్ స్పీడ్ 198.9 ఎంబీపీఎస్‌గా నమోదైందని పేర్కొన్నారు. సరసమైన ధరలకే డేటా లభిస్తుండటంతో ఆన్‌లైన్ వీడియో స్ట్రీమింగ్, డిజిటల్ చెల్లింపులు వంటి సేవలు గణనీయంగా విస్తరించాయని ఆయన అభిప్రాయపడ్డారు. కంపెనీ నెట్‌వర్క్ సామర్థ్యాన్ని వివరిస్తూ, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 3,60,537 టవర్లు, 26,800 వీఎఓ స్పెక్ట్రమ్‌తో సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ నిర్వహణ లాభం 17.8 శాతం వృద్ధితో రూ. 76,225 కోట్లుగా నమోదైందని తెలిపారు. అలాగే, జియో హోమ్ బ్రాడ్‌బ్యాండ్ కస్టమర్ల సంఖ్య కూడా 2.8 కోట్లకు చేరుకుందని వివరించారు. భారత్‌ను ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ సమాజంగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని ఆకాశ్ అంబానీ పునరుద్ఘాటించారు. స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన నెట్‌వర్క్ సాఫ్ట్‌వేర్, పరికరాలను అంతర్జాతీయ ఆపరేటర్లకు విక్రయించే దిశగా యోచిస్తున్నట్లు పేర్కొన్నారు. 2031 నాటికి భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థ 1.4 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నామని, అందులో ప్రధాన వాటాను కైవసం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ ఐపీఓ ద్వారా ఒక్కో షేరుకు రూ. 1,065 నుంచి రూ. 1,119 ధరల శ్రేణిలో గరిష్ఠంగా రూ. 30,213 కోట్లను సమీకరించాలని జియో భావిస్తోంది. ఈ ఇష్యూలో భాగంగా రూ. 10 ముఖ విలువ కలిగిన 27 కోట్ల నూతన షేర్లను జారీ చేయనుంది. ఇది భారత స్టాక్ మార్కెట్ చరిత్రలోనే అతిపెద్ద ఐపీఓలలో ఒకటిగా నిలవనుంది.

## సీఈసీని రక్షించేందుకే ఇదంతా

- మొదటి పేజి తరువాయి

ఆరోపించారు. ఢిల్లీలో నటుడు ప్రకాశ్ రాజ్, మరో నేత నేహా బోరాలతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అభిజిత్ దీప్కే మాట్లాడారు. సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాను అరెస్ట్ చేసి తీహార్ జైలుకు పంపిన నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. "ఒక్క జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడటం కోసం ఢిల్లీ యువత వీధుల్లో పోరాడుతుంటే వారిని ఈడ్చుకెళుతున్నారు. సొంత పౌరుల మీదనే ప్రభుత్వం యుద్ధం చేస్తోంది. సీఈసీని రక్షించడానికి ఇంత రాద్ధాంతం ఎందుకు?" అని దీప్కే ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

**13 కోట్ల ఓట్లు తొలగించారని ఆరోపణ**

ఎన్నికల కమిషన్ తీరును, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను దీప్కే తీవ్రంగా తప్పుబట్టారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ, ఇండియా కూటముల మధ్య ఓట్ల తేడా కేవలం 2 శాతమేనని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో జ్ఞానేశ్ కుమార్ బీజేపీకి సహాయం చేస్తున్నారని ప్రజలు ఎందుకు అనుమానించకూడదని ప్రశ్నించారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్నికల కమిషన్ దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓటర్ల పేర్లను తొలగించిందని దీప్కే సంచలన ఆరోపణ చేశారు. ఓటర్ల జాబితాలో చనిపోయినట్లు ప్రకటించబడిన కొందరు వ్యక్తులను తాను కలిశానని ఆయన తెలిపారు. మోదీ ప్రభుత్వం తన పూర్తి యంత్రాంగాన్ని ఉపయోగించి జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడుతోందని విమర్శించారు.

**'ఒకే దేశం, ఒకే పార్టీ' అజెండా**

ప్రభుత్వం ప్రతిపాదించిన 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' అనేది కేవలం ఒక నినాదం మాత్రమేనని, దాని వెనుక ఉన్న అసలు అజెండా 'ఒకే దేశం, ఒకే పార్టీ' అని దీప్కే విమర్శించారు. దమ్ముంటే దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించాలని ఆయన ప్రధాని మోదీకి సవాల్ విసిరారు. అంతర్జాతీయ సమాజం ఏమనుకుంటుందోనని ప్రధాని భయపడుతున్నారా? అని ప్రశ్నించారు.

**సీజేపీ నేతల అరెస్ట్**

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జంతర్ మంతర్ వద్ద సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా, అజింక్యా షిండే నిరసన చేపట్టారు. పోలీస్ బారికేడ్లను దాటి నినాదాలు చేయడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ అధికారి విధులకు ఆటంకం కలిగించారనే అభియోగంపై కేసు నమోదు చేసి, దాస్, రంకాలను జ్యుడీషియల్ కస్టడీకి పంపి తీహార్ జైలుకు తరలించారు. అజింక్యా షిండేను వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేసినట్లు సీజేపీ లీగల్ టీం హెడ్ రత్నా సింగ్ తెలిపారు. తమ నేతల అరెస్టులను, ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ తమ పోరాటాన్ని కొనసాగిస్తామని సీజేపీ స్పష్టం చేసింది.

# సంక్షేమం నుంచి స్వావలంబన దిశగా.. ఇదే మా విధానం

- మొదటి పేజి తరువాయి

**గ్రామాలే ఉపాధి కేంద్రాలుగా..**

రాష్ట్రంలో 1.10 కోట్ల మంది సభ్యులతో 11 లక్షల స్వయం సహాయక సంఘాలు (డ్వాక్రా) ఉన్నాయని, ఇవి ఏటా రూ.69 వేల కోట్ల టర్నోవర్ సాధిస్తున్నాయని చంద్రబాబు వివరించారు. నిన్నటి పొదుపు సంఘాలు నేడు వ్యాపార సంస్థలుగా రూపాంతరం చెందుతున్నాయని, భవిష్యత్తులో అంతర్జాతీయ బ్రాండ్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ మేళాలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 650 స్వయం సహాయక సంఘాలు పాల్గొంటున్నాయని, ఇది కేవలం ప్రదర్శన కాదని, గ్రామీణ ఉత్పత్తులకు ఏడాది పొడవునా మార్కెటింగ్ అవకాశాలు కల్పించే దిశగా తొలి అడుగని పేర్కొన్నారు. తమ అనుభవాలను పంచుకుంటూ, కొత్త వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకోవాలని మహిళలకు సూచించారు.

**సాంకేతికతతో ప్రపంచ మార్కెట్‌కు..**

'స్వయం ఏపీ' బ్రాండ్ ఉత్పత్తులను ఈ-కామర్స్, ఆన్‌లైన్ షాపింగ్ వేదికల ద్వారా ప్రపంచ మార్కెట్‌కు పరిచయం చేస్తామని చంద్రబాబు తెలిపారు. వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను వ్యాపార అభివృద్ధికి వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. మహిళల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకున్నప్పుడే 'వికసిత్ భారత్' లక్ష్యం సాధ్యమవుతుందని అన్నారు. మహిళల భద్రత, ఆత్మగౌరవానికి ప్రాధాన్యమిస్తూనే, వారి ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రతి స్వయం సహాయక సంఘం ఒక ఆర్థిక శక్తిగా, ప్రతి మహిళ ఒక పారిశ్రామికవేత్తగా, ప్రతి గ్రామం ఒక ఉపాధి కేంద్రంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, పెమ్మసాని చంద్రశేఖర్, రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, వంగలపూడి అనిత తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపేటలో దారుణం

## పెట్రోల్ పోసి భర్తను సజీవ దహనం చేసిన భార్య

వివాహేతర సంబంధం ఒక కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. భర్త మరో మహిళతో సంబంధం పెట్టుకున్నాడన్న ఆగ్రహంతో రగిలిపోయిన భార్య, పెట్రోల్ పోసి నిప్పంటించి అతడిని దారుణంగా హత్య చేసింది. ఈ ఘోరం తెలంగాణలోని నారాయణపేట జిల్లా మరికల్ మండలంలో చోటుచేసుకుంది. మరికల్ మండలం మద్వార్ గ్రామానికి చెందిన బాలస్వామి (46), తెలపల్లి రాములమ్మ దంపతులకు 28 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే, బాలస్వామి అదే గ్రామానికి చెందిన మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న రాములమ్మ భర్తను పలుమార్లు నిలదీసింది. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య గత కొంతకాలంగా తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే సెప్టెంబర్ 24వ తేదీ రాత్రి బాలస్వామి ఇంట్లో నిద్రిస్తుండగా, రాములమ్మ ఈ ఘాతుకానికి పాల్పడింది. వ్యవసాయ పనుల కోసం ఇంట్లో నిల్వ ఉంచిన పెట్రోల్‌ను భర్తపై పోసి నిప్పంటించింది. తీవ్ర గాయాలతో హాహాకారాలు చేసిన బాలస్వామిని గమనించిన స్థానికులు, చికిత్స నిమిత్తం తొలుత మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ సెప్టెంబర్ 25న అతను మృతి చెందాడు. ఈ ఘటనపై డీఎస్పీ నల్లపు లింగయ్య మాట్లాడుతూ, మృతుడి నుంచి సేకరించిన మరణ వాంగ్మూలం, ఇతర సాక్ష్యాధారాలు ఆధారంగా రాములమ్మను విచారించగా, ఆమె నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. నిందితురాలిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు.

## విచ్ఛిన్నకర శక్తులతో జగన్ చేతులు కలిపారు

- మొదటి పేజి తరువాయి

జగన్ ప్రోత్సహించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేశారు. నేడు రాజకీయ లబ్ధి కోసం దేశ విచ్ఛిన్నకర శక్తులతో చేతులు కలిపారు. వైకాపా పాలనలో ఎదురైన ఇబ్బందులను రాష్ట్ర ప్రజలు మర్చిపోలేదు. ప్రజాస్వామ్యం పేరుతో దేశంలో అస్థిరత, విధ్వంసం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్న శక్తులతో కలిసి జగన్ సాగిస్తున్న రాజకీయ ప్రయత్నాలను వారు నిశితంగా గమనిస్తున్నారు. తగిన సమయంలో ప్రజాస్వామ్యబద్ధంగా తమ తీర్పును వెల్లడిస్తారు" అని పేర్కొన్నారు. సీజేపీకి మద్దతుగా జగన్ చేసిన పోస్టు.. దానికి సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ధన్యవాదాలు తెలపడం ఏపీ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

## దేశంలో 4 కొత్త రైళ్లు, 3 పొడిగింపులు..

# 12 కొత్త హాల్టులు

దేశవ్యాప్తంగా రైలు ప్రయాణికులకు భారతీయ రైల్వే శుభవార్త అందించింది. కనెక్టివిటీని మెరుగుపరిచే లక్ష్యంతో కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా 4 కొత్త రైలు సర్వీసులను ప్రారంభించేందుకు, ఇప్పటికే నడుస్తున్న 3 రైళ్లను పొడిగించేందుకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. వీటితో పాటు, ప్రయాణికుల రద్దీ, డిమాండ్ ఆధారంగా 12 ముఖ్యమైన రైళ్లకు కొత్తగా హాల్టింగ్ స్టేషన్లను కేటాయించింది.

ఈ మార్పులకు సంబంధించిన రైళ్ల ప్రారంభ తేదీలు, పొడిగింపు తేదీలను సంబంధిత రైల్వే జోన్లు త్వరలో వేర్వేరు నోటిఫికేషన్ల ద్వారా వెల్లడిస్తాయని అధికారులు తెలిపారు.

**కొత్తగా ఆమోదం పొందిన రైళ్లు:**

1. రాయ్‌పూర్ -- రౌఘాట్ మెమూ (68768/68769): ఈ రైలు శనివారం మినహా వారానికి 6 రోజులు నడుస్తుంది.

రౌఘాట్ నుంచి ఉదయం 6:30 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 1:05 గంటలకు రాయ్‌పూర్ చేరుకుంటుంది.

రాయ్‌పూర్ నుంచి మధ్యాహ్నం 1:20 గంటలకు బయలుదేరి రాత్రి 7:00 గంటలకు రౌఘాట్ వెళుతుంది.

2. హరిద్వార్ -- వెరావల్ ఏసీ ఎక్స్‌ప్రెస్ (14326/14325): ఇది వారానికి రెండుసార్లు నడిచే సర్వీస్.

ఈ రైలు హరిద్వార్ నుంచి బుధ, ఆదివారాల్లో; వెరావల్ నుంచి గురు, సోమవారాల్లో నడుస్తుంది.

**హాల్టులు:** రూర్కీ, ముజఫర్‌నగర్, మీరట్ సిటీ, ఘజియాబాద్, ఢిల్లీ, రేవారి, జైపూర్, అజ్మీర్, అబూ రోడ్, పాలన్‌పూర్, రాజ్‌కోట్, జునాగఢ్ వంటి ప్రధాన స్టేషన్లలో ఆగుతుంది.

3. హరిద్వార్ -- ఓఖా ఏసీ ఎక్స్‌ప్రెస్ (14328/14327): ఇది వారానికి ఒకసారి నడిచే సర్వీస్.

హరిద్వార్ నుంచి శుక్రవారం, ఓఖా నుంచి శనివారం బయలుదేరుతుంది.

హాల్టులు: రూర్కీ, మీరట్ సిటీ, ఢిల్లీ, జైపూర్, అజ్మీర్, అబూ రోడ్, రాజ్‌కోట్, జామ్‌నగర్, ద్వారకలలో ఆగుతుంది.

4. బిర్ - ఇటార్సీ ప్యాసింజర్ (51689/51690): వారానికి ఒకసారి నడుస్తుంది.

బీర్ నుంచి శనివారం, ఇటార్సీ నుంచి ఆదివారం అందుబాటులో ఉంటుంది.

**పొడిగించిన సర్వీసులు:**

1. బాంద్రా (T) -- ఢిల్లీ సరాయ్ రోహిల్లా గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్ (12216/12215): ఈ రైలును హరిద్వార్ వరకు పొడిగించారు. పొడిగింపు మార్గంలో ఢిల్లీ, ఘజియాబాద్, మీరట్ సిటీ, ముజఫర్‌నగర్, రూర్కీలలో అదనపు స్టాపులు ఉంటాయి.

2. గోండియా - వాడ్సా మెమూ (68806): ఈ రైలును అర్మోరి వరకు పొడిగించారు.

3. వాడ్సా - చందా ఫోర్ట్ మెమూ (68808): ఈ రైలును కూడా అర్మోరి వరకు పొడిగించారు.

**కొత్తగా కేటాయించిన హాల్టులు:**

కింది 12 రైళ్లకు కొత్తగా హాల్టింగ్ సౌకర్యం కల్పించారు.

వల్సాడ్-వడనగర్ ఎక్స్‌ప్రెస్ (20959/20960): అంకలేశ్వర్

హతియా-హౌరా క్రియ యోగా ఎక్స్‌ప్రెస్ (18616): చకులియా

సహర్సా-అమృత్‌సర్ గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్ (12203/12204): పానిపట్

హైదరాబాద్-రక్సాల్ ఎక్స్‌ప్రెస్ (17005/17006): రిగా

దర్భంగా-గోమతి నగర్ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ (15561/15562): రిగా

తిరుపతి-రక్సాల్ ఎక్స్‌ప్రెస్ (17433/17434): బైరగ్నియా

లౌకహా బజార్--ఆనంద్ విహార్ టెర్మినల్ స్పెషల్ (04013/04014): ఘోరసహన్

బాంద్రా (౧)--జైపూర్ ఎక్స్‌ప్రెస్ (22933/22934): నవ్‌సారి

అలప్పుజ-కన్నూర్ ఎక్స్‌ప్రెస్ (16307): వల్లిక్కున్ను

KSR బెంగళూరు-ఎర్నాకుళం జంక్షన్ ఎక్స్‌ప్రెస్ (16377/16378): ఒట్టపాలెం

లోకమాన్య తిలక్ టెర్మినస్-పాట్లీపుత్ర ఎక్స్‌ప్రెస్ (12141/12142): గహ్మర్

సీల్దా-రాంపూర్‌హట్ ఎక్స్‌ప్రెస్ (13187/13188): బారక్‌పూర్

ఈ కొత్త సర్వీసులు, పొడిగింపులు, అదనపు హాల్టుల వల్ల పలు ప్రాంతాల మధ్య ప్రయాణ సౌకర్యం గణనీయంగా మెరుగుపడుతుందని, ప్రయాణికుల సమయం ఆదా అవుతుందని రైల్వే శాఖ వర్గాలు భావిస్తున్నాయి.

# హార్మూజ్‌లో కుప్పలుగా తేలియాడుతున్న ఐఫోన్లు

చట్ట విరుద్ధమైన, ప్రమాదకర మార్గంలో నౌక ప్రయాణిస్తున్న క్రమంలో ఈ ఘటన చోటుచేసుకుందని అధికారులు చెప్పినట్లు స్థానిక మీడియా పేర్కొంది.

ప్రమాదానికి గురైన నౌక దాదాపు 2500 కంటైనర్లతో వెళు న్నట్లు సమాచారం. వీటిలో ఐఫోన్లు, లగ్జరీ పెర్ఫ్యూమ్ బాటిళ్లు, తదితర వస్తువులున్నాయి. ప్రమాదం అనంతరం కంటైనర్లు చెల్లాచెదురు కాగా.. అందులోని ఐఫోన్‌లు సహా ఇతర వస్తువులు కుప్పలుగా నీటిపై తేలియాడుతున్న దృశ్యాలు కనిపించాయి. జీఎఫ్ఎస్ ప్రైడ్ అనే సింగపూర్ జెండా ఉన్న నౌక దుబాయ్ నుంచి ఈ సరకులను తీసుకువెళ్తున్నట్లు తెలుస్తోంది.

హార్మూజ్ మార్గంలో వెళ్తున్న సమయంలో సింగపూర్‌కు చెందిన రెండు సరకు రవాణా నౌకలు గుర్తు తెలియని వస్తువులను ఢీకొన్నాయని నౌకాశ్రయ అధికారులు తొలుత పేర్కొన్నారు. ఇందులో

ఒకటి మునిగిపోగా.. మరొకటి సురక్షితంగా గమ్యాన్ని చేరుకున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మొదటి నౌకలోని సిబ్బంది అందర్నీ సురక్షితంగా తరలించామని, ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని సింగపూర్ పోర్టు అధికారులు వెల్లడించారు.

## కుప్పకూలిన పాఠశాల పైకప్పు.. 34 మంది విద్యార్థులు మృతి

ఉదయం పూట తరగతులు జరుగుతుండగా పాఠశాల భవనం పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. సమాచారం అందుకున్న సహాయక బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని చర్యలు చేపట్టాయి. ఈ దుర్ఘటనలో 34 మంది విద్యార్థులతో పాటు ఓ ఉపాధ్యాయురాలు కూడా మరణించినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. మరో 40 మందికిపైగా గాయపడ్డారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రమాదం నేపథ్యంలో పాఠశాల యజమానిని పోలీసులు అరెస్టు చేశారు. ఘటనపై పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# విజయవాడ దుర్గమ్మకు రూ.75 లక్షల విలువైన స్వర్ణ కిరీటం విరాళం

విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ కనకదుర్గ అమ్మవారికి దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ భారీ కానుక అందింది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ భక్తుడు సుమారు రూ.75 లక్షల విలువైన స్వర్ణ కిరీటాన్ని అమ్మవారికి విరాళంగా సమర్పించారు. వివరాల్లోకి వెళితే.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన కుర్మినాయుడు, పద్మావతమ్మ దంపతుల కుమారుడైన కె. దుర్గా శ్రీనివాస్ ఈ కిరీటాన్ని విరాళంగా ఇచ్చారు. 494 గ్రాముల స్వచ్ఛమైన బంగారంతో రూపొందించిన ఈ కిరీటంలో ఎరుపు, నీలం, తెలుపు, ఆకుపచ్చ రంగుల నవరత్నాలను పొదిగారు. దసరా ఉత్సవాల సందర్భంగా దుర్గా శ్రీనివాస్ ఈ కిరీటాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) శీనానాయక్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతోనే ఈ కానుకను సమర్పించానని, పవిత్రమైన నవరాత్రుల సమయంలో కిరీటాన్ని అందించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ప్రస్తుతం ఆలయంలో జరుగుతున్న ప్రత్యేక పూజలు, దర్శనాల నడుమ ఈ విరాళం అందడం విశేషం.

## సీట్ల సర్దుబాటు అంశం.. చంద్రబాబుతో మంత్రుల చర్చలు

- మొదటి పేజి తరువాయి

తుది కసరత్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో మంత్రులు నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, ఎంపీ లింగమనేని రమేష్ తదితరులు భేటీ అయ్యారు. సీట్ల సర్దుబాటు, అభ్యర్థుల ఎంపికపై సుదీర్ఘంగా చర్చిస్తున్నారు. శుక్రవారం నుంచి నామినేషన్లు ప్రారంభం కానుండటంతో ఈ ప్రక్రియను త్వరగా కొలిక్కి తీసుకొచ్చేందుకు యత్నిస్తున్నారు.

# మున్సిపల్ పోరుకు వైసీపీ అభ్యర్థులు ఖరారు..

- మొదటి పేజి తరువాయి

మొత్తం 27 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా, సామాజిక సమీకరణాలు, మహిళా ప్రాతినిధ్యానికి పెద్దపీట వేసినట్లు స్పష్టమవుతోంది.

**7 కార్పొరేషన్లకు మేయర్ అభ్యర్థులు వీరే:**

వైసీపీ ప్రకటించిన జాబితా ప్రకారం, ఏడు కీలక నగర పాలక సంస్థలకు మేయర్ అభ్యర్థులను ఖరారు చేశారు.

విజయనగరం (అన్‌రిజర్వ్‌డ్ - మహిళ): కోలగట్ల శ్రావణి (వైశ్య)
విశాఖపట్నం (అన్‌రిజర్వ్‌డ్ - మహిళ): వరుదు కల్యాణి (కాపు వెలమ)
ఏలూరు (బీసీ): గంటా మోహన్ రావు (తూర్పు కాపు)
మచిలీపట్నం (బీసీ - మహిళ): లంకా జ్యోతి (తూర్పు కాపు)
ఒంగోలు (అన్‌రిజర్వ్‌డ్): కుప్పం ప్రసాద్ (వైశ్య)
నెల్లూరు (అన్‌రిజర్వ్‌డ్): ఆనం విజయ్ కుమార్ రెడ్డి (రెడ్డి)
కడప (అన్‌రిజర్వ్‌డ్ - మహిళ): బండి దీప్తిరెడ్డి (రెడ్డి)

**మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఛైర్మన్ అభ్యర్థులు:**

రాష్ట్రవ్యాప్తంగా 14 మున్సిపాలిటీలు, 6 నగర పంచాయతీలకు ఛైర్మన్ అభ్యర్థులను పార్టీ అధిష్ఠానం ప్రకటించింది.

**మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థుల జాబితా:**

ఇచ్ఛాపురం (బీసీ - మహిళ): పిలక రాజ్యలక్ష్మి (రెడ్డిక)
పలాస-కాశీబుగ్గ (అన్‌రిజర్వ్‌డ్ - మహిళ): తలసు శ్రీ పద్మ (కళింగ వైశ్య)
నర్సీపట్నం (బీసీ - మహిళ): చింతకాయల అనిత (కాపు వెలమ)
యలమంచిలి (అన్‌రిజర్వ్‌డ్ - మహిళ): బొద్దపు తులసి (కాపు)
తుని (బీసీ - మహిళ): పిట్ల రామ తులసి (శెట్టిబలిజ)
కొవ్వూరు (అన్‌రిజర్వ్‌డ్ - మహిళ): మన్నె పద్మ (కమ్మ)
రామచంద్రాపురం (బీసీ): చింతపల్లి నాగేశ్వరరావు (శెట్టిబలిజ)
కొండపల్లి (ఎస్సీ - మహిళ): నల్లమోతు తేజస్విని (మాదిగ)
తెనాలి (అన్‌రిజర్వ్‌డ్): మద్దాలి శేషాచలం (వైశ్య)
చీరాల (ఎస్సీ - మహిళ): డాక్టర్ ఇస్త్రాల షెర్లీ (మాల)
బద్వేల్ (అన్‌రిజర్వ్‌డ్): రాచపూడి వెంకట సాయి కృష్ణ (వైశ్య)
ప్రొద్దుటూరు (అన్‌రిజర్వ్‌డ్): పొర్రెడ్డి నరసింహారెడ్డి (రెడ్డి)
పులివెందుల (అన్‌రిజర్వ్‌డ్ - మహిళ): వైయస్ ప్రమీలమ్మ (రెడ్డి)
మదనపల్లె (బీసీ): జింకా చలపతి (బోయ)

**నగర పంచాయతీ ఛైర్మన్ అభ్యర్థులు:**

యలేశ్వరం (ఎస్సీ - మహిళ): బదిరెడ్డి ఆశాలత (మాదిగ)
వుయ్యూరు (ఎస్సీ): పైడముక్కల దివ్య (మాదిగ)
గురజాల (అన్‌రిజర్వ్‌డ్): పోలు వీరారెడ్డి (రెడ్డి)
కనిగిరి (అన్‌రిజర్వ్‌డ్ - మహిళ): పులి శాంతి రెడ్డి (రెడ్డి)
బుచ్చిరెడ్డిపాలెం (అన్‌రిజర్వ్‌డ్ - మహిళ): షేక్ షకీలా బేగం (ముస్లిం)
కమలాపురం (అన్‌రిజర్వ్‌డ్ - మహిళ): మార్జుల కవిత (రెడ్డి)

పార్టీ విడుదల చేసిన ఈ జాబితాలో మహిళలకు అత్యధిక ప్రాధాన్యం కల్పించారు. మొత్తం 27 స్థానాల్లో 14 స్థానాలు మహిళలకే కేటాయించడం విశేషం. అదేవిధంగా, బీసీ, ఎస్సీ, మైనారిటీ వర్గాలకు కూడా గణనీయమైన సంఖ్యలో అవకాశాలు ఇచ్చారు. ఈ ప్రకటనతో ఆయా నగరాలు, పట్టణాల్లో ఎన్నికల సందడి అధికారికంగా మొదలైంది. పార్టీ ప్రకటించిన అభ్యర్థులు త్వరలోనే నామినేషన్లు దాఖలు చేసి, ప్రచార బరిలోకి దిగనున్నారు.

# మీసేవ ఆపరేటర్ల విజ్ఞప్తికి స్పందన.. నిలిచిపోయిన పౌర సేవలు పునరుద్ధరణ!

- మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం.. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల రీ-ఇష్యూ సేవలు మళ్లీ అందుబాటులోకి!
- శ్రీకాళహస్తి ఎమ్మెల్యేకు నియోజకవర్గ మీసేవ ఆపరేటర్ల ప్రత్యేక కృతజ్ఞతలు

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 15:**

రాష్ట్రవ్యాప్తంగా మీసేవ కేంద్రాల్లో గత కొద్ది రోజులుగా నిలిచిపోయిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల రీ-ఇష్యూ సేవలు తిరిగి అందుబాటులోకి రావడంతో ప్రజలకు ఊరట లభించింది.

మీసేవ ఆపరేటర్ల విజ్ఞప్తులు, ప్రజాప్రతినిధుల చొరవతో ఈ సమస్య ప్రభుత్వం దృష్టికి చేరగా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో నిలిచిపోయిన సేవల పునరుద్ధరణకు మార్గం సుగమమైంది.

**సేవలు నిలిచిపోవడంతో ప్రజలకు తప్పని ఇబ్బందులు!**

కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు విద్యార్థుల విద్యా అవసరాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వివిధ ప్రభుత్వ సేవలు, ఇతర అధికారిక కార్యక్రమాలకు ఎంతో కీలకం. అలాంటి ధ్రువీకరణ పత్రాల రీ-ఇష్యూ సేవలు నిలిచిపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అవసరమైన సమయంలో పత్రాలను తిరిగి పొందలేక పలువురు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఈ నేపథ్యంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను గుర్తించిన మీసేవ ఆపరేటర్లు, తమ సంక్షేమ సంఘం (ఎం ఎస్ ఎస్ ఎస్) సూచనల మేరకు సమస్య పరిష్కారానికి కృషి ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులను కలిసి వినతిపత్రాలు సమర్పించారు.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
స్వర్ణ గ్రామం - స్వర్ణ వార్డు శాఖ
APESD AI 3113153
GOVERNMENT OF ANDHRA PRADESH
REVENUE DEPARTMENT
COMMUNITY, NATIVITY & DATE OF BIRTH CERTIFICATE

నిలిచిపోయిన సేవలను తక్షణమే పునరుద్ధరించి ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని కోరారు.

**ప్రజాప్రతినిధుల చొరవతో మంత్రి నారా లోకేష్ దృష్టికి సమస్య!**

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా నిలుస్తూ మీసేవ కేంద్రాల ద్వారా వివిధ పౌర సేవలను అందిస్తున్న ఆపరేటర్లు.. సేవలు నిలిచిపోవడంతో సామాన్య ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. ఆపరేటర్ల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న ప్రజాప్రతినిధులు ఈ సమస్యను ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు.

ప్రజలకు అవసరమైన పౌర సేవలు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలన్న విజ్ఞప్తుల నేపథ్యంలో మంత్రి నారా లోకేష్ స్పందించి, సంబంధిత అధికారులకు సేవలను పునరుద్ధరించాలని ఆదేశించినట్లు మీసేవ ఆపరేటర్లు తెలిపారు.

మంత్రి ఆదేశాల మేరకు ఐటీ శాఖ అధికారులు చర్యలు చేపట్టడంతో బుధవారం సాయంత్రానికి నిలిచిపోయిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల రీ-ఇష్యూ సేవలు తిరిగి అందుబాటులోకి వచ్చాయి. దీంతో తమ అవసరాల కోసం ఈ సేవలపై ఆధారపడిన ప్రజలకు ఉపశమనం కలిగింది.

**మీసేవ ఆపరేటర్ల కృషికి ఫలితం.. రాష్ట్రవ్యాప్తంగా హర్షం!**

ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేయడంలో మీసేవ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లలేని వారు, వివిధ ధ్రువీకరణ పత్రాలు పొందాల్సిన అవసరం ఉన్నవారు మీసేవ కేంద్రాల ద్వారా తమ పనులను పూర్తి చేసుకుంటున్నారు. ఇలాంటి కీలకమైన సేవలు నిలిచిపోవడంతో ప్రజలు ఎదుర్కొన్న సమస్యను పరిష్కరించేందుకు మీసేవ ఆపరేటర్లు చేసిన ప్రయత్నాలు ఫలించడంతో ఆపరేటర్లలో హర్షం వ్యక్తమైంది.

సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి చొరవ చూపిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌తో పాటు సంబంధిత మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు రాష్ట్ర మీసేవ ఆపరేటర్ల సంక్షేమ సంఘం (ఎం ఎస్ ఎస్ ఎస్) సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

**శ్రీకాళహస్తి ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు!**

మీసేవ సేవల పునరుద్ధరణ కోసం చేపట్టిన ప్రయత్నాల్లో భాగంగా తమ విజ్ఞప్తికి స్పందించి, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సహకరించిన శ్రీకాళహస్తి ఎమ్మెల్యేకు నియోజకవర్గ మీసేవ ఆపరేటర్లు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి, పౌర సేవల పునరుద్ధరణకు చొరవ చూపిన ప్రజాప్రతినిధులకువారుకృతజ్ఞతలుతెలియజేశారు.( పజలకు అవసరమైన సేవలు సకాలంలో అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖలు నిరంతరం పర్యవేక్షించాలని మీసేవ ఆపరేటర్లు కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి సాంకేతిక లేదా పరిపాలనా సమస్యల కారణంగా పౌర సేవలు నిలిచిపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ప్రజల సమస్యలను గుర్తించి, వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేసినప్పుడు ప్రజలకు సకాలంలో సేవలు అందుతాయని ఈ పరిణామం మరోసారి స్పష్టం చేస్తోందని మీసేవ ఆపరేటర్లు అభిప్రాయపడ్డారు.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి । చిత్తూరు । వై.ఎస్.ఆర్. కడప

# డాక్టర్ ప్రభాకర్ నాయుడు సేవలు మరువలేనివి :ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి



**కావలి అక్టోబర్ 15 పెన్ పవర్ ప్రతినిధి**

కావలి పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు, సమాజ సేవకులు దివంగత డాక్టర్ ప్రభాకర్ నాయుడు సేవలను కావలి ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరని స్థానిక శాసనసభ్యులుకావ్య కృష్ణారెడ్డి కొనియాడారు.గురువారం కావలిలోని ఆర్ &బి. అతిథి గృహంలో డాక్టర్ ప్రభాకర్ నాయుడు సంతాప సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, ప్రభాకర్ నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**పద్మశ్రీ పురస్కారానికి కృషి:**

వైద్యరంగంలో, సామాజిక సేవా రంగంలో డాక్టర్ ప్రభాకర్ నాయుడు అందించిన విశేష సేవలకు గానూ ఆయనకు 'పద్మశ్రీ' అవార్డు దక్కాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. దీనికోసం అవసరమైతే నాయకులతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

**వైద్య రంగానికి ఆయన పేరే గుర్తుగా:** భవిష్యత్తులో కావలికి మెడికల్ రంగానికి సంబంధించి ఏ ప్రాజెక్ట్ లేదా అభివృద్ధి కార్యక్రమం వచ్చినా, దానికి డాక్టర్ ప్రభాకర్ నాయుడు పేరునే నామకరణం చేస్తామని వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

**కావలిలో విగ్రహావిష్కరణ & సంతాప సభలు:** ప్రతి సంవత్సరం ఆయన జ్ఞాపకార్థం సంతాప సభను నిర్వహిస్తామని, కావలి పట్టణంలో ఆయన విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేస్తామని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వైద్యాధికారులు, పట్టణ ప్రముఖులు మరియు ప్రభాకర్ నాయుడు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# బుచ్చిలో ఇద్దరు టిడిపి సీనియర్ల రాజీనామా

- కోటరీ తో ఇ మడలేకనే బయటికి వస్తున్నాం
- విలువలు లేని చోట ఉండకూడదనే రాజీనామా నిర్ణయం

**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ అక్టోబర్ 15.**

స్థానిక సంస్థల ఎన్నికలవేళ ఇద్దరు సీనియర్ టిడిపి నాయకులు తెలుగుదేశం పార్టీకి గట్టి షాక్ ఇచ్చారు. మండలంలోని రేబాల గ్రామానికి చెందిన మాజీ పెన్నా డెల్టా చైర్మన్ యర్రం రెడ్డి గోవర్ధన్ రెడ్డి, వవ్వేరు కోపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ సూరా శ్రీనివాసులు రెడ్డి తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పంచేడు గ్రామంలో ని సూరా శ్రీనివాసులు రెడ్డి నివాసంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు ఈ మేరకు తెలియజేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ సుమారు 35 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీకి ఎనలేని సేవలు అందించామని, ఎన్నికల సమయంలో అధిష్ఠానం ఆదేశాలను శిరసా వహిస్తూ ఎవరిని పోటీలో నిలిపితే రాత్రింబవళ్లు కష్టపడి వారిని గెలిపించా మన్నారు. ఈరోజు వరకు కూడా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి,ఎంపి ప్రభాకర్ రెడ్డి లతో తమకు ఎలాంటి విభేదాలు లేవని, ప్రస్తుతం జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలలో తన కుటుంబ సభ్యులకు గానీ, శ్రీనివాసులు రెడ్డి కుటుంబంలో గాని చైర్మన్ టికెట్ కేటాయించమని అడగడంజరిగిందని,వారుతిరస్కరించడంతో విలువలు లేని చోట ఉండకూడదనే ఈ రాజీనామా నిర్ణయం తీసుకున్నామన్నారు. భవిష్యత్ కార్యాచరణ త్వరలో తెలియజేస్తామన్నారు.వవ్వేరు కోపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ సూరా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే దంపతులతో తమకు ఎలాంటి విభేదాలులేవని,బయటివారు వచ్చి తమ మండలంలో



పెత్తనం చాలా ఇస్తుంటే తమ మనోభావాలు దెబ్బ తినడంతో పార్టీకి రాజీనామా చేసి బయటికి రావాలని నిర్ణయించుకున్నామన్నారు.తమభవిష్యత్కార్యాచరణన ం త్వరలోనే తెలియజేస్తామన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపిపి మన్నేపల్లి శ్రీనివాసులు, గోవర్ధన్ రెడ్డి అనుచరులు,అభిమానులు, సూరా శ్రీనివాసులురెడ్డి అనుచరులు అభిమానులు భారీగా పాల్గొన్నారు.

# రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ తో ఏవీ సుబ్బారెడ్డి భేటీ
## స్థానిక సంస్థల ఎన్నికల కార్యాచరణపై సుదీర్ఘ చర్చ

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 15:**



స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ను నంద్యాలలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు ప్రస్తుత రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహాలు మరియు నియోజకవర్గ పరిధిలోని పలు కీలక రాజకీయ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపునకు సమన్వయంతో కృషి చేయాలని, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను మరింత బలోపేతం చేయాలని వారు చర్చించినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో కొప్పుల శివ నాగిరెడ్డి , మునగాల విశ్వనాథ్ రెడ్డి, పబ్బతి వేణు తదితరులు పాల్గొన్నారు

# మాజీ మంత్రి,ఎమ్మెల్యే పెద్దిరెడ్డి వివాహ మహోత్సవానికి విశిష్ట అతిథిగా హాజరు.



**పెన్ పవర్ రొంపిచర్ల మండలం అక్టోబర్ 15**

రొంపిచర్ల మండలంలో వి ఎం ఆర్ గార్డెన్స్ లో వివాహానికి పెళ్లి వివాహ వేడుకకు హాజరైన మాజీ మంత్రి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. గరిగ వసంత మరియు గరిగ మనోహర్ ఆర్ బెస్ట్ పల్లె, చెంచం రెడ్డి గారి గ్రామం వారి కుమార్తె వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు, ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి రెడ్డిశ్వర్ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, ద్వారక నాగరెడ్డి వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# డాక్టర్ పోచా శ్రీకాంత్ రెడ్డి హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు!
## శాస్త్రీయ దర్యాప్తు.. సమర్థవంతమైన ప్రాసిక్యూషన్‌తో నిందితులకు శిక్ష

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 15**

డోన్ :డాక్టర్ పోచా ప్రభాకర్ రెడ్డి కుమారుడు డాక్టర్ పోచా శ్రీకాంత్ రెడ్డి హత్య కేసులో ముగ్గురు నిందితులకు కర్నూలు జిల్లా నాలుగో అదనపు సెషన్స్ న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. శాస్త్రీయ పద్ధతుల్లో దర్యాప్తు నిర్వహించి, న్యాయస్థానంలో నేరం నిరూపించేందుకు పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సమన్వయంతో కృషి చేశారు

2018లో నమోదైన కేసు.. సమగ్ర దర్యాప్తు

డోన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 120/2018గా ఐపీసీ సెక్షన్లు 120(బి ), 420, 302, 201, 109తో పాటు 34 కింద కేసు నమోదైంది. అప్పటి డోన్ టౌన్ ఎస్ఐ శ్రీనివాసులు, డోన్ సీఐ రాజగోపాల్ నాయుడు కేసును సమగ్రంగా దర్యాప్తు చేసి న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు.

ఈ కేసును విచారించిన కర్నూలు జిల్లా నాలుగో అదనపు సెషన్స్ న్యాయమూర్తి లీలావతి ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెలువరించారు. ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు




ప్రకాష్ రెడ్డి, శ్రీనివాస భట్ న్యాయస్థానంలో సమర్థవంతంగా వాదనలు వినిపించారు.

కేసు విచారణలో పలువురి కీలక పాత్ర

విచారణ సమయంలో ఎస్ఐలు శరత్ కుమార్ రెడ్డి, నరేంద్ర కుమార్ సాక్షుల విచారణలో కీలకంగా వ్యవహరించారు. కోర్టు కానిస్టేబుళ్లు అల్లి పీరా, బషీర్‌తో పాటు సిమ్స్ ఏఎస్ఐ రవి రావు, కృష్ణమోహన్ రెడ్డి కేసు విచారణ సజావుగా సాగేందుకు సహకరించారు.

జీవిత ఖైదు పడిన నిందితులు వీరే..

1. మురారి నరసింహ
2. మురారి చంద్రశేఖర్
3. మురారి నాగరత్న

ఈ కేసులో సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి, న్యాయస్థానంలో శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని నంద్యాల జిల్లా ఎస్పీ, డోన్ డీఎస్పీ అభినందించారు.

తీవ్ర నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

తీవ్రమైన నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డోన్ పట్టణ సీఐ తెలిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమన్వయంతో నేర నిరూపణకు కృషి చేసి బాధితులకు న్యాయం జరిగేలా పోలీసు శాఖ పనిచేస్తుందని పేర్కొన్నారు.

హత్యలు, కుట్రలు, మోసాలు, సాక్ష్యాధారాలను ధ్వంసం చేయడం వంటి నేరాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. నేరాలకు సంబంధించిన ఆధారాలను శాస్త్రీయంగా సేకరించి, సమగ్ర దర్యాప్తుతో న్యాయస్థానంలో నేరం నిరూపించేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

# వెంకటేశ్వర స్వామి ఆలయంలో పర్వత రెడ్డి రాణా ప్రమోద్ రెడ్డి ప్రత్యేక పూజలు.

**. (పెన్ పవర్ జిల్లా బ్యూరో ):**



నెల్లూరు వెంకటేశ్వరపురంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంతో పాటు స్థానిక పుట్ట వద్ద వైస్సార్సీపీ నెల్లూరు సిటీ ఇన్ చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తనయులు పర్వత రెడ్డి రాణా ప్రమోద్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారం లో పాల్గొన్నారు 70వ డివిజన్ వైఎస్సార్సీపీ అభ్యర్థి భాగి వెంకటరమణ , 71వ డివిజన్ అభ్యర్థి రుహీనా గారు విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ అభ్యర్థులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీస్సులు పొందారు. అనంతరం 70వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో 53 డివిజన్ ఇన్ చార్జ్ వెంగళ రెడ్డి గారు, 54వ డివిజన్ ఇన్ చార్జ్ మస్తాన్ గారు, వైస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రూ.88 లక్షల ప్రహరీ గోడ.. చిన్నపాటి వర్షానికే కుప్పకూలిందా?
## ప్రారంభించిన 1015 రోజులకే నేలమట్టం.. నిర్మాణ నాణ్యతపై అనుమానాలు!

**తొట్టంబేడు,పెన్ పవర్,అక్టోబర్ 15:**

రైతుల ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ ప్రహరీ గోడ కూలిపోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. సుమారు రూ. 88 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రహరీ గోడ చిన్నపాటి వర్షానికే కూలిపోయిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బంక్ ప్రారంభించి 1015 రోజులు కూడా గడవకముందే ఈ ఘటన చోటుచేసుకోవడంపై పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌లోనే నిర్మాణ నాణ్యతపై ఆరోపణలు రావడం గమనార్హం. ప్రహరీ గోడ నిర్మాణ బాధ్యతలను మండల పార్టీ అధ్యక్షుడు చేపట్టినట్లు స్థానికంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో, పనుల నాణ్యతపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



**నాణ్యతా ప్రమాణాలు పాటించారా?**

ప్రహరీ గోడ నిర్మాణానికి సంబంధించిన అంచనాలు, ఉపయోగించిన నిర్మాణ సామగ్రి, నాణ్యతా పరీక్షలు, అధికారుల పర్యవేక్షణ తదితర అంశాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిర్మాణం పూర్తయిన కొద్ది రోజులకే గోడ కూలిపోవడానికి అసలు కారణమేంటి? పనులను పర్యవేక్షించిన అధికారులు ఎవరు? నిర్మాణ సమయంలో నాణ్యతా ప్రమాణాలను పాటించారా? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.

**అధికారులు విచారణ చేపట్టాలి**

ప్రహరీ గోడ కూలిన ఘటనలో స్థానికులకు గాయాలైనట్లు సమాచారం ఉండటంతో సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నారు. నిర్మాణ పనులకు సంబంధించిన అంచనాలు, బిల్లులు, నాణ్యతా పరీక్షల వివరాలను పరిశీలించి, అవసరమైతే స్వతంత్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రజాధనంతో చేపట్టిన నిర్మాణాలు నాణ్యతతో ఉండాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. ప్రహరీ గోడ కూలిపోవడానికి గల కారణాలను నిష్పక్షపాతంగా తేల్చి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# నంద్యాలలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన..
## అధికార పార్టీ బ్యానర్లను ఎందుకు తొలగించలేదు






**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 15**

సాయిబాబా నగర్ నూనెపల్లె ఫ్లైఓవర్ వద్ద టిడిపి నాయకుల ఫ్లెక్సీలుఅధికారుల నిమ్మకు నీరెత్తిన వైఖరిపై రాజకీయ నాయకులు స్థానికులు ఆగ్రహంరాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషన్ (సెకండ్ ) నోటిఫికేషన్ విడుదల చేయడంతోనే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎన్నికల నియామావళి) తక్షణమే అమల్లోకి వచ్చింది. అయితే నంద్యాల పట్టణంలో మాత్రం ఎన్నికల నిబంధనల అమలు పట్ల అధికారులు ప్రదర్శిస్తున్న అలసత్వం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

పట్టణంలో ఎన్నికల నిబంధనలను పటిష్ఠంగా అమలు చేయాల్సిన అధికారులు, అధికార పార్టీ నాయకుల బ్యానర్లను తొలగించడంలో జాప్యం వహించడంపై స్థానిక ప్రజలతో పాటు ఇతర రాజకీయ పార్టీల నాయకులు బహిరంగంగానే నిలదీస్తున్నారు. అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారా? లేక నిబంధనల పట్ల నిర్లక్ష్యంగా ఉన్నారా? అని ప్రశ్నిస్తున్నారు...

# కావలిలో ఘనంగా డాక్టర్ అబ్దుల్ కలాం జయంతి వేడుకలు

**- జనసేన కార్యాలయంలో నివాళులర్పించిన కావలి నియోజకవర్గ సమన్వయకర్త మన్నెమాల సుకుమార్ రెడ్డి**



**కావలి అక్టోబర్ 15 పెన్ పవర్**

నెల్లూరు జిల్లా కావలి పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో భారత మాజీ రాష్ట్రపతి, 'మిస్సైల్ మ్యాన్' డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ కావలి నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ మన్నెమాల సుకుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా సుకుమార్ రెడ్డి అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి, భావోద్వేగంతో నివాళులర్పించారు.

అనంతరం శ్రీ మన్నెమాల సుకుమార్ రెడ్డి మాట్లాడుతూ...

"అబ్దుల్ కలాం కేవలం ఒక శాస్త్రవేత్త లేదా దేశ మాజీ రాష్ట్రపతి మాత్రమే కాదు, కోట్లాది మంది యువతకి స్ఫూర్తిప్రదాత. సామాన్య కుటుంబంలో జన్మించి, క్రమశిక్షణ, కఠోర శ్రమ, అంకితభావంతో దేశ అత్యున్నత పదవిని అధిరోహించిన మహానీయుడు కలాం . భారత్‌ను సాంకేతికంగా, రక్షణ రంగంలో అగ్రగామిగా నిలబెట్టడంలో ఆయన పాత్ర మరవరానిది. నిరంతరం విద్యార్థులతో, యువతతో గడుపుతూ 'కలలు కనండి.. వాటిని సాకారం చేసుకునేందుకు కష్టపడండి' అని పిలుపునిచ్చిన గొప్ప మార్గదర్శి. నేటి యువత కలాం సిద్ధాంతాలను, ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ శ్రేయస్సుకు, దేశాభివృద్ధికి తోడ్పడాలి."

ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, వీరమహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కలాం కి ఘన నివాళులు అర్పించారు.

# గూడూరులో ఘనంగా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు

## అన్నదానం, వృద్ధ మహిళలకు చీరల పంపిణీ





**గూడూరు, పెన్ పవర్, అక్టోబర్,15:**

భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని గూడూరులోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం, వృద్ధ మహిళలకు చీరల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలను చేపట్టారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వై. రమణారెడ్డి, ఆర్. గోవింద నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కలాం దేశానికి అందించిన సేవలను, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఆయన సాధించిన విజయాలను, యువతకు అందించిన స్ఫూర్తిని ట్రస్ట్ సభ్యులు స్మరించుకున్నారు.

ట్రస్ట్ వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ సయ్యద్ తాజుద్దీన్ మాట్లాడుతూ, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని అన్నారు. ఆయన చూపిన దేశభక్తి, నిరాడంబరత, క్రమశిక్షణ, సేవా దృక్పథం తమ ట్రస్ట్‌కు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. పేదలు, వృద్ధులు, నిరుపేద కుటుంబాలు, విద్యార్థులకు అవసరమైన సహాయం అందించడమే ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆపన్నులకు అండగా నిలిచి, మానవతా విలువలను పెంపొందించడం ద్వారా కలాం ఆశయాలను కొనసాగిస్తామని చెప్పారు.

జయంతి వేడుకల్లో భాగంగా వివిధ ప్రాంతాలకు చెందిన వృద్ధ మహిళలకు చీరలను పంపిణీ చేశారు. అలాగే అవసరమైన వారికి అన్నదానం నిర్వహించారు. సమాజంలోని నిరుపేదలకు సహాయం అందించడం, సేవా భావాన్ని పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలను చేపట్టినట్లు ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు సయ్యద్ న్యామతుల్లా, సయ్యద్ బర్కతుల్లా, ట్రస్ట్ కార్యదర్శి వై. శ్రీనివాసులు, సభ్యులు షేక్ చాంద్ బాషా, షేక్ యస్దాని, షేక్ రబ్బాని, స్థానిక ప్రముఖులు, ఇతర ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

# శరన్నవరాత్రుల ఐదో రోజు వైభవంగా శ్రీ వరలక్ష్మి దేవి అలంకరణ

## భక్తులకు కనువిందు చేసిన కరిమారియమ్మ తల్లి దివ్య స్వరూపం



**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,అక్టోబర్ 15:**

శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శ్రీకాళహస్తి పట్టణంలోని బహదూర్‌పేట, రాతిపనివారి వీధిలో కొలువై ఉన్న శ్రీశ్రీశ్రీ కరిమారియమ్మ తల్లికి శ్రీ వరలక్ష్మి దేవి అలంకరణను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సకల ఐశ్వర్యాలను ప్రసాదించే తల్లిగా, సౌభాగ్య ప్రదాయినిగా, భక్తుల కోరికలు తీర్చే కల్పవల్లిగా కొలువుదీరిన అమ్మవారి దివ్య మంగళ స్వరూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

నవరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించడంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. శ్రీ వరలక్ష్మి దేవి రూపంలో దర్శనమిచ్చిన జగన్మాతను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కృపాకటాక్షాలు తమ కుటుంబాలపై ఎల్లవేళలా ఉండాలని, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు కలగాలని భక్తులు ప్రార్థించారు.

జగన్మాత అనుగ్రహంతో సకల శుభాలు సిద్ధించాలిశరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని వివిధ దివ్య అలంకరణల్లో దర్శించుకోవడం భక్తుల్లో భక్తిభావాన్ని మరింత పెంపొందిస్తోంది. లోకకల్యాణం కోసం, సకల జీవరాశుల శ్రేయస్సు కోసం ఆ జగన్మాత ఆశీస్సులు అందరిపై ఉండాలని భక్తులు ఆకాంక్షించారు.

# కుల ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం వద్దు!



**- స్థానిక ఎన్నికల అభ్యర్థులకు సకాలంలో సర్టిఫికెట్లు ఇవ్వాలి**
**- ఏఐటీయూసీ డిమాండ్.. లేకుంటే ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా**

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 15:**

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యర్థులకు కుల ధ్రువీకరణ పత్రాలను సకాలంలో జారీ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం శ్రీకాళహస్తి ఆర్డీఓ కార్యాలయంలో ఏఓకు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా నాయకులు కత్తి రవి, తొండు మల్లికార్జున్ మాట్లాడుతూ.. కుల ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం కారణంగా అర్హులైన అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాన్ని కోల్పోకూడదని పేర్కొన్నారు. పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించి, అర్హులకు సర్టిఫికెట్లు అందించాలని కోరారు.

వినతిపత్రంలోని ప్రధాన డిమాండ్లు

కుల ధ్రువీకరణ పత్రాలను సకాలంలో జారీ చేయాలి.

పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి.

సర్టిఫికెట్ల జారీకి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలి.

రీ-వెరిఫికేషన్ పేరుతో అనవసర జాప్యాన్ని నివారించాలి.

సాంకేతిక సమస్యలను పరిష్కరించి అర్హులకు నిబంధనల ప్రకారం సర్టిఫికెట్లు అందించాలి.అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఆర్డీఓ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని ఏఐటీయూసీ నాయకులు హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పాండు, మురళి, గణేష్, మనోహర్, రమేష్, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖ వైద్యులు డాక్టర్ గుర్రాల రవికృష్ణ కు పుత్ర వియోగం



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 15**

నంద్యాలకు చెందిన ప్రముఖ డాక్టర్ రవి కృష్ణ, సునంద దంపతుల పెద్ద కుమారుడు సాయి ప్రియన్ గురువారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు. గత నెల 30వ తేదీ సాయి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అక్కడే చికిత్స పొందుతూ అక్టోబర్ 15వ తేదీ తెల్లవారు జామున 5:45 గంటలకు దివంగతులు అయ్యారు. సాయి మరణంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. సాయి పార్థివ దేహాన్ని పద్మావతినగర్ లో పార్క్ పక్కన ఉన్న స్వగృహంలో సందర్శనార్థం ఉంచడం జరిగింది...

# కూటమి అభ్యర్థులను గెలిపించుకుంటాం. కిషోర్ గునుకుల,విజయలక్ష్మి గునుకుల,

**నెల్లూరు అక్టోబర్ 15 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

ప్రజా మద్దతుతో కూటమి అభ్యర్థుల విజయం ఖాయం అభివృద్ధికి అండగా నిలుస్తున్న ప్రజలు!

గత నెల రోజులుగా నెల్లూరు నగర కార్పొరేషన్ పరిధిలోని 21వ డివిజన్ (పాత 16వ డివిజన్)లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా జనసేన పార్టీ తరఫున నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమం యథావిధిగా రామజీ నగర్‌లోని 5, 6వ వీధుల్లో కొనసాగింది. ఈ సందర్భంగా నాయకులు ప్రతి ఇంటి గడపను సందర్శించి, ప్రజలతో మమేకమై కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు తమ మద్దతు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

**పవన్ కళ్యాణ్ నిర్ణయాలు రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది**

జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ ఎంతో ఓర్పుతో, సంయమనంతో, రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తీసుకున్న నిర్ణయాలు నేడు కూటమి ప్రభుత్వ పాలనకు బలమైన పునాదిగా నిలుస్తున్నాయని నాయకులు పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ఆయన అనుసరిస్తున్న విధానం రాష్ట్ర రాజకీయాల్లో బాధ్యతాయుతమైన నాయకత్వానికి నిదర్శనమని తెలిపారు.

**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టితో అభివృద్ధి పథంలో రాష్ట్రం.**

**నెల్లూరు అభివృద్ధికి మంత్రి పొంగూరు నారాయణ విశిష్ట సేవలు**



నెల్లూరు నగర అభివృద్ధిలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే శ్రీ పొంగూరు నారాయణ కీలక పాత్ర పోషిస్తున్నారని జనసేన నాయకులు తెలిపారు. విద్యా రంగంలో మెరుగైన అవకాశాలు, వైద్య సేవల అభివృద్ధి, నగర మౌలిక సదుపాయాల మెరుగుదలతో పాటు ప్రజలు తమ కాళ్లపై తాము నిలబడేలా ఉపాధి, అభివృద్ధి అవకాశాలకు ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమన్నారు.

అమరావతి రాజధాని అభివృద్ధి నుంచి నెల్లూరు నగర పురోగతి వరకు రాష్ట్ర సమగ్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, పురపాలక శాఖ మంత్రిగా నారాయణ అందిస్తున్న సేవలు ప్రాధాన్యత సంతరించుకున్నాయని పేర్కొన్నారు. నెల్లూరు నగరాన్ని మరింత అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల సహకారం అవసరమని అన్నారు.

**ప్రజల విశ్వాసమే మా బలం అభివృద్ధికి మా మద్దతు**

రామజీ నగర్ 5, 6వ వీధుల్లో నిర్వహించిన ప్రచారంలోపలువురుకుటుంబాలుతమఅభిప్రాయాలను పంచుకుంటూ,ప్రజాసమస్యలపైపోరాడేనాయకత్వానికి, అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లే పాలనకు మద్దతుగా నిలుస్తామని చెప్పడం సంతోషకరమని నాయకులు తెలిపారు.

రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరింత ముందుకు సాగాలంటే స్థానిక సంస్థల్లోకూడాసమన్వయంతోపనిచేసేప్రజాప్రతినిధులు ఎన్నిక కావాలని వారు కోరారు. నెల్లూరు నగర అభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులకు ప్రజలు తమ విలువైన మద్దతు అందించి విజయపథంలో నడిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కిషోర్ గునుకుల, విజయలక్ష్మి గునుకుల తదితరులు పాల్గొని ప్రజలను కలిసి కూటమి అభ్యర్థుల విజయానికి మద్దతు కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కిషోర్ గునుకుల, వీరమహిళ విజయలక్ష్మి గునుకులతో పాటు నాగేంద్ర బాలు, నరహరి, కృష్ణమోహన్ రెడ్డి ,బాలాజీ,వీరమహిళలుప్రవల్లిక, ప్రశాంతి,సుప్రియ,విజయ, ఆమని, శ్రీలక్ష్మి, కృష్ణవేణి, కల్పన,పద్మ,లావణ్యతదితరులు ప్రచారంలో చురుకుగా పాల్గొన్నారు.

# శివాలయం అవినీతి ఆరోపణలపై చైర్మన్ ఆగ్రహం

**- ఆరోపణలు నిరూపించాలి.. లేదంటే పరువునష్టం దావా తప్పదు**
**- పాలకమండలి సభ్యుడు గురునాథంకు చైర్మన్ బాలకృష్ణ నాయుడు సవాల్**

**గూడూరు, పెన్ పవర్, అక్టోబర్,15:**

గూడూరు పట్టణంలోని శ్రీ స్వయంభు మూలస్థానేశ్వర స్వామి శివాలయంలో అభివృద్ధి పనుల పేరుతో విరాళాలువసూలుచేస్తూఅవినీతికిపాల్పడుతున్నారంటూ పాలకమండలి సభ్యుడు ఎం. గురునాథం చేసిన ఆరోపణలను ఆలయ చైర్మన్ బాలకృష్ణ నాయుడు తీవ్రంగా ఖండించారు.

అవినీతి జరిగినట్లు ఆధారాలు ఉంటే నిరూపించాలని, నిరాధార ఆరోపణలు చేస్తే పరువునష్టం దావాతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. గురువారం ఆలయంలో పాలకమండలి సభ్యులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

తాను చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం భక్తులు, పాలకమండలి సభ్యుల సహకారంతో ఆలయంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు బాలకృష్ణ నాయుడు తెలిపారు. దాతల నుంచి రూ.8.50 లక్షల విరాళాలు అందగా, వాటి ఖర్చులు, మిగిలిన రూ.1.95 లక్షల వివరాలను పాలకమండలి సభ్యులకుపుస్తకరూపంలో అందజేసినట్లు పేర్కొన్నారు. ప్రతి విరాళానికి రసీదు అందించామని, దాతల పేర్లను శిలాఫలకాలపై ముద్రించి ఆలయంలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆలయ నిధులను వ్యక్తిగత ప్రయోజనాలకు వినియోగించాల్సిన అవసరం తనకు లేదని, భక్తుల సేవ, ఆలయ అభివృద్ధే తన లక్ష్యమని స్పష్టం చేశారు.

ఆలయం వెనుక నాగప్రతిష్ఠల ప్రాంతంలో జరిగిన పనులకు సంబంధించి కూడా తనపై అసత్య ఆరోపణలు చేశారని బాలకృష్ణ నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయానికి సంబంధించిన నగదు, ఆభరణాల విషయంలో ఆరోపణలు చేసిన వారు వాటిని ఆధారాలతో నిరూపించాలని సవాల్ విసిరారు.



ఎమ్మెల్యే పాసిమ్ సునీల్ కుమార్ సహకారంతో ఆలయ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి స్వామివారికి సేవ చేసే అవకాశం లభించిందని, ఇందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యవహరించవద్దని, నిరాధార ఆరోపణలు కొనసాగితేచట్టపరంగాఎదుర్కొంటాననిహెచ్చరించారు.

ఈ సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు అరుణ్ కుమార్, వసుధ, మమత, విజయ, ప్రధాన అర్చకులు నరేష్ కుమార్ శర్మ, వాచ్మెన్ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సిమెంట్ రోడ్డుపై వర్షపు నీరు.. పూడి గ్రామస్తులకు తప్పని తిప్పలు!

## కృష్ణ మందిరం, సీతాలమ్మ గుడి వీధిలో నిలిచిన నీరు డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని గ్రామస్తుల విజ్ఞప్తి

**తొట్టంబేడు, పెన్ పవర్, అక్టోబర్ 15:**

మండల పరిధిలోని పూడి గ్రామంలో కృష్ణ మందిరం, సీతాలమ్మ గుడి ముందున్న వీధిలో వర్షపు నీరు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిమెంట్ రోడ్డు నిర్మించినప్పటికీ, వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో ప్రతి వర్షానికీ రోడ్డుపై నీరు నిలిచి ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

స్థానికుల వివరాల ప్రకారం.. గతంలో ఈ వీధిలో సిమెంట్ రోడ్డు నిర్మించారు. అయితే వీధి ప్రారంభంలో ఉన్న రెండు ఇళ్ల ముందు ఎర్రమట్టి, గ్రావెల్ పోసి రోడ్డు స్థాయి కంటే ఎత్తుగా చదును చేయడంతో వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం మూసుకుపోయిందని వీధివాసులు వాపోతున్నారు. ఫలితంగా వర్షం కురిసిన ప్రతిసారీ నీరంతా రోడ్డుపైనే నిలిచిపోతూ రాకపోకలకు ఆటంకంగా మారుతోంది.



**పిల్లలు, వృద్ధులకు తప్పని ఇబ్బందులు**

రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు నడవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీరు ఎక్కువ కాలం నిల్వ ఉండటంతో దోమలు పెరిగి, సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా, కృష్ణ మందిరం, సీతాలమ్మ గుడికి వచ్చే భక్తులు సైతం నిలిచిన నీటిలో నుంచే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది.

**పంచాయతీ అధికారులు స్పందించాలి**

ప్రజలరాకపోకలకుఇబ్బందులుకలగకుండా సంబంధిత పంచాయతీ అధికారులు తక్షణమే సమస్యను పరిశీలించాలని గ్రామస్తులు కోరుతున్నారు. రోడ్డుపై నీరు నిలిచిపోవడానికి గల కారణాలను గుర్తించి, అడ్డుగా ఉన్న మట్టిని తొలగించడంతోపాటు వర్షపు నీరు సాఫీగా బయటకు వెళ్లేలా తగిన డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని, ప్రజారోగ్యం మరియు రాకపోకల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# శ్రీకాళహస్తిలో శరన్నవరాత్రి వైభవం

## శ్రీ స్కందమాత అలంకారంలో జ్ఞానప్రసూనాంబ అమ్మవారు.. లలితాదేవి అలంకారంలో కనకదుర్గమ్మ దర్శనం!

**శ్రీకాళహస్తి,పెన్ పవర్,అక్టోబర్ 15:**

శ్రీకాళహస్తి క్షేత్రంలో శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు అమ్మవారు శ్రీ స్కందమాత దేవి అలంకారంలో భక్తులకు దివ్యదర్శనమిచ్చి అనుగ్రహించారు. అమ్మవారి దర్శనంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

**సంప్రదాయబద్ధంగా బొమ్మల కొలువు**

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో సంప్రదాయబద్ధంగా బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు. వివిధ దేవతామూర్తులు, పౌరాణిక ప్రతిమలు, అందమైన బొమ్మలను క్రమపద్ధతిలో కొలువుదీర్చి భక్తులను ఆకట్టుకునేలా అలంకరించారు. ఈ బొమ్మల కొలువు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలిచింది.

**లలితాదేవి అలంకారంలో కనకదుర్గమ్మ**

ఇదిలా ఉండగా, ఆలయ ప్రాంగణంలోని శ్రీ కనకదుర్గ అమ్మవారు శ్రీ లలితాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. విశేష అలంకరణలో కొలువుదీరిన అమ్మవారిని భక్తులు దర్శించుకుని భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.

శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవార్లకు నిర్వహిస్తున్న విశేష అలంకరణలు, పూజా కార్యక్రమాలు శ్రీకాళహస్తి క్షేత్రంలో ఆధ్యాత్మిక



వాతావరణాన్ని మరింత పెంపొందిస్తున్నాయి.

జగన్మాతఅనుగ్రహంతోప్రజలందరికీఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు కలగాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు.

# హైదరాబాద్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల మెరుపు తనిఖీలు..
## భారీగా కల్తీ ఖోవా స్వాధీనం

**పెన్ పవర్,అక్టోబర్ 15:**

హైదరాబాద్:నగరంలో ఆహార కల్తీని అరికట్టేందుకు ఫుడ్ సేఫ్టీ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. గురువారం తెల్లవారుజామున నగర వ్యాప్తంగా ఉన్న ఆరు డైరీ యూనిట్లు మరియు ఒక రవాణా కేంద్రంలో అధికారులు ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఆహార భద్రతా ప్రమాణాలకు సంబంధించిన పలు తీవ్రమైన ఉల్లంఘనలు వెలుగుచూశాయి.

ప్రధానంగా ఎలాంటి శుభ్రత లేని అపరిశుభ్ర వాతావరణంలో పాల ఉత్పత్తులను తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

అంతేకాకుండా, ఈ యూనిట్లకు సంబంధించి



ఎలాంటి అధికారిక FSSAI లైసెన్సులు లేకపోవడం గమనార్హం. పాల ఉత్పత్తులను నిల్వ చేయడానికి అవసరమైన సరైన ఉష్ణోగ్రతలను పాటించకుండా నిబంధనలను పూర్తిగా విస్మరించారు.

ఎలాంటి కోల్డ్ స్టోరేజ్ సౌకర్యం లేని వాహనాలలో, ప్రమాదకరమైన ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేసి అక్రమంగా తరలిస్తున్న సుమారు 3.6 టన్నుల కల్తీ ఖోవాను అధికారులు పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ అనారోగ్యకరమైన ఆహార పదార్థాలను విక్రయిస్తున్న ఇలాంటి కేంద్రాలపై రానున్న రోజుల్లో మరింత కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

# వరంగల్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రులు..
## త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి వైద్య సేవలు

**పెన్ పవర్,అక్టోబర్ 15:**

వరంగల్:వరంగల్ జిల్లా కేంద్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, ఎంపీ వేం నరేందర్ రెడ్డి మరియు పలువురు స్థానిక ఎమ్మెల్యేలు గురువారం ఉత్సాహంగా పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణ తీరుతెన్నులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పనుల పురోగతిపై చర్చించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,

గత ప్రభుత్వం ఈ భారీ ఆసుపత్రి నిర్మాణ పనులను పట్టించుకోకుండాఅసంపూర్తిగావదిలేసిందని విమర్శించారు. అయితే ప్రస్తుత ప్రజాప్రభుత్వం వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ, ఆసుపత్రి నిర్మాణ పనులను ఎంతో వేగవంతం చేసిందని తెలిపారు. పనులను త్వరలోనే తుది దశకు తీసుకువచ్చి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.



అంతేకాకుండా, రాబోయే దసరా పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని ఈ ఆసుపత్రిలో ఓపీ (OP) సేవలను అధికారికంగా ప్రారంభిస్తామని ఆయన సంతోషంగా ప్రకటించారు. వరంగల్ ప్రజలకు కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని, నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని నాయకులు ఈ సందర్భంగా ఉద్ఘాటించారు.

# అరవపల్లిలో అల్లకల్లోలం: 12 గంటల విద్యుత్ ఇవ్వకపోతే రైతుల ఆత్మహత్యలే శరణం!

**పెన్ పవర్,అక్టోబర్ 15:**

సూర్యాపేట జిల్లా, జాజిరెడ్డిగూడెం మండలంలోని అరవపల్లి గ్రామంలో రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వర్షాలు లేక పంటలు ఎండిపోతున్న తరుణంలో, ప్రభుత్వం కేవలం 8 గంటల మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తుండటంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కరెంట్ కోతలు, సాగునీటి సమస్యలతో అల్లాడిపోతున్న రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతోందని గ్రామస్తులు మండిపడుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వ్యవసాయానికి 12 గంటల విద్యుత్ సరఫరా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు మరియు ఆవేదన:

సరిపోని విద్యుత్ సరఫరా: వ్యవసాయానికి కేవలం 8 గంటలు మాత్రమే కరెంట్ ఇస్తుండటంతో పొలాలకు సరిపడా నీరు అందక చేతికి వచ్చిన పంటలు ఎండిపోతున్నాయి.

వర్షాభావ పరిస్థితుల నడుమ కరెంట్ కోతలు రైతుల వెన్నువిరుస్తున్నాయి.

భారీగా పెరుగుతున్న అదనపు ఖర్చులు (జనరేటర్ల భారం): విద్యుత్ సరిగా రాకపోవడంతో పొలాలను కాపాడుకోవడానికి రైతులు ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయిస్తున్నారు. డీజిల్, పెట్రోల్





జనరేటర్లను నడిపిస్తూ నీటిని పారించుకోవాల్సి వస్తోంది. దీనివల్ల డీజిల్ మరియు పెట్రోల్ ఖర్చుల రూపంలోనే రోజుకు ఏకంగా 6,000 రూపాయల వరకు ఖర్చు అవుతోంది. రోజువారీగా ఇంత పెద్ద మొత్తంలో ఖర్చు పెట్టుకోలేక రైతులు ఆర్థికంగా పూర్తిగా చితికిపోతున్నారు.

గిట్టుబాటు ధరల లేమి మరియు నష్టాలు: మరోవైపు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లేక రైతులు నిరాశ నిస్పృహల్లో కూరుకుపోతున్నారు. ఉదాహరణకు పంట ఉత్పత్తులను అమ్ముకుందామంటే కేవలం 2,500 రూపాయలకే అమ్ముకునే దుస్థితి నెలకొంది. పెరిగిన పెట్టుబడి ఖర్చులు, జనరేటర్ల భారం, కనీస గిట్టుబాటు ధర దక్కకపోవడంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు.

ఆత్మహత్యలే శరణం: అప్పులు చేసి లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి, వర్షాలు లేక, కరెంట్ అందక కళ్ల ముందే పొలాలు ఎండిపోతుంటే తట్టుకోలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే అప్పులపాలై రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం తప్ప వేరే మార్గం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వానికి హెచ్చరిక - రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెబుతాం:**

రైతుల పక్షాన నిలవని ప్రభుత్వం ఎందుకని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకపోతే, రాబోయే నెక్స్ట్ ఎలక్షన్లలో ప్రజలే స్వయంగా మీకు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరిస్తున్నారు. ప్రజలకు అనుకూలంగా ఉండాల్సిన పాలకులు, రైతుల కష్టాలను పట్టించుకోకుండా ఇబ్బందులకు గురిచేస్తే ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొక తప్పదని, ఇదే తీరు కొనసాగితే గ్రామస్థులు మరియు రైతులు పెద్ద ఎత్తున ధర్నాలకు, ఆందోళనలకు సిద్ధమయ్యే పరిస్థితి వస్తుందని తీవ్రంగా హెచ్చరిస్తున్నారు.

పొలాలు ఎండుబారిపోకుండా వ్యవసాయానికి నిరంతరం 12 గంటల విద్యుత్ సరఫరాను అందించాలని, ఆర్థికంగా నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# ఫుట్ పాత్ పై నిద్రిస్తున్న వ్యక్తిని సుత్తెతో కొట్టి హత్య



**పెన్ పవర్,అక్టోబర్ 15:**

హైదరాబాద్: హైదరాబాద్ నగరంలోని చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం తెల్లవారుజామున ఒక దారుణమైన ఘటన చోటుచేసుకుంది. అశోక్ నగర్ వద్ద ఫుట్ పాత్ పై ప్రశాంతంగా నిద్రిస్తున్న సుభాష్ (40) అనే కూలీని గుర్తు తెలియని దుండగులు సుత్తెతో అత్యంత క్రూరంగా కొట్టి చంపారు.

ఈ దాడిలో బాధితుడి నుదురు, కన్ను తీవ్రంగా ఛిద్రం కావడంతో అతను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సంఘటనా స్థలంలో రక్తం తడిసిన సుత్తె లభించడంతో నిందితులు దీనిని పథకం ప్రకారమే చేసినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. నిందితులను పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

# గరగపర్రు లో మీ మార్ట్ ప్రారంభం



**పెన్ పవర్,అక్టోబర్ 15:**

ప్రజలకు నిత్యావసర వస్తువులను సరసమైన ధరలకు అందించడానికి రేషన్ షాపుల ద్వారా మీ మార్ట్ లను ఏర్పాటు చేసిందనీ భీమవరం అసిస్టెంట్ సప్లై ఆఫీసర్ రవి శంకర్ అన్నారు. గురువారం నాడు ఆయన గరగపర్రు లోని 31 షాపు లో ఆయన మీ మార్ట్ ను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం ఆయన వినియోగదారులతో మాట్లాడుతూ బయట మార్కెట్ కన్నా తక్కువ రేట్ల కు మీ మార్ట్ లో సరుకులు లభ్యం అవుతాయని, ప్రజలందరూ



బఉపయోగించుకోవాలని కోరారు. పాలకోడేరు మండల తహసీల్దార్ లక్ష్మీ మాట్లాడుతూ ఇప్పటికే పలు జిల్లాల్లో మీ మార్ట్ లు విజయవంతంగా సాగుతున్నాయని అన్నారు. మన మండలం లో కూడా త్వరలో అన్ని షాపుల్లోనూ మీ మార్ట్ లు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. ఈ కార్యక్రమం లో సిఎస్ డి టి ఆదిశేషయ్య, మండల డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దొంగ కృష్ణ, భారతి, సెక్రెటరీ సాయి రామకృష్ణ, కోశాధికారి కొల్లా సత్యనారాయణ, మునీశ్వరరావు, బైరెడ్డి వెంకటేశ్వరరావు, జల్లూరి మల్లికార్జునరావు, వెంకట రాజుతదితరులు పాల్గొన్నారు

# విజయవాడ అలంకార్ థియేటర్‌లో పార్కింగ్ దోపిడీ:
## పెచ్చులూడుతున్న పైకప్పు, డ్రైనేజీ ను తలపిస్తున్న సెల్లార్..

**పెన్ పవర్,అక్టోబర్ 15:**

విజయవాడ గాంధీనగర్‌లోని ప్రముఖ 'అలంకార్ థియేటర్'లో పార్కింగ్ పేరిట సాగుతున్న దందా సినీ ప్రేక్షకులను తీవ్ర ఆగ్రహానికి గురిచేస్తోంది. కనీస వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమైన యాజమాన్యం, ప్రమాదకర పరిస్థితులు నెలకొన్న సెల్లార్‌లో వాహనాలు నిలిపినందుకు అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తూ సామాన్యుల జేబులకు చిల్లులు వేస్తోంది.

థియేటర్ భవనం పైకప్పు, గోడల పైభాగం పూర్తిగా శిథిలావస్థకు చేరి సిమెంట్ పెచ్చులు ఊడిపడుతున్నాయి. కాంక్రీట్ పెళ్లలు రాలిపోయి లోపలి ఇనుప చువ్వలు బయటకు ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. ఎప్పుడు ఏ కాంక్రీట్ ముక్క తలపై పడుతుందోనని వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా తీవ్ర గాయాలు లేదా ప్రాణనష్టం జరిగే ముప్పు పొంచి ఉన్నప్పటికీ నిర్వాహకులు కనీస మరమ్మతులు కూడా చేపట్టకపోవడం గమనార్హం.

మరోవైపు, వాహనాలు పార్క్ చేసే సెల్లార్ ప్రాంతం మొత్తం వర్షపు నీరు, మురుగునీటితో నిండిపోయి చెరువును తలపిస్తోంది. నేలంతా నీరు నిలిచిపోయి బురదమయంగామారడంతోప్రేక్షకులువాహనాలను నిలపడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. మురుగునీటిలోనేనడుచుకుంటూ వెళ్లి వాహనాలను పార్క్ చేయాల్సి వస్తోంది.

ఇంతటి అధ్వానమైన పరిస్థితులు ఉన్నప్పటికీ, పార్కింగ్ రుసుముల పేరిట థియేటర్ నిర్వాహకులు నిలువుదోపిడీకి పాల్పడుతున్నారు. స్కూటర్, బైక్ వంటి ద్విచక్ర వాహనాలకు ₹30, చొప్పున వసూలు చేస్తూ టికెట్లు జారీ చేస్తున్నారు. అంత భారీగాడబ్బులు గుంజుతున్న యాజమాన్యం, టికెట్‌పై మాత్రం "వాహనాలపై గల సామాన్లకు మా బాధ్యత లేదు" అని నిబంధన ముద్రించి చేతులుదులుపుకుంటోంది.ఎటువంటికనీస భద్రత, సదుపాయాలు కల్పించకుండా అధిక వసూళ్లకు పాల్పడుతున్న నిర్వాహకుల తీరుపై ప్రేక్షకులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సినిమా థియేటర్లలో పార్కింగ్ నిబంధనలు, భవనాల



భద్రతా ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షించాల్సిన నగరపాలక సంస్థ (వీఎంసి) అధికారులు, సంబంధిత యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లువ్యవహరిస్తున్నారనేవిమర్శలువస్తున్నాయి. పెను ప్రమాదం జరగకముందే అధికారులు వెంటనే స్పందించి సెల్లార్ భద్రతను తనిఖీ చేయాలని, అక్రమ పార్కింగ్ వసూళ్లకు అడ్డుకట్ట వేసి నిబంధనలు ఉల్లంఘిస్తున్న యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని నగరవాసులు డిమాండ్ చేస్తున్నారు.

# రైతులకు సాగు పద్ధతులపై అవగాహన..
## పంటల దిగుబడి పెంపునకు అధికారుల సూచనలు!






**పెన్ పవర్,అక్టోబర్ 15:**

లోకేశ్వరం:మండలంలోని బాగాపూర్ గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'పొలం బడి' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.యాసంగి పంటల సాగులో రైతులు అనుసరించాల్సిన మెళకువలు,నాణ్యమైన దిగుబడులు సాధించే పద్ధతులపై వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ, పంటల సాగులో శాస్త్రీయ విధానాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పంటలలో చీడపీడల నివారణ,ఎరువుల సమతుల్య వినియోగం, నీటి యాజమాన్యం వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు.అలాగే,రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటికి తగిన పరిష్కార మార్గాలను సూచించారు. వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన పద్ధతులను అందిపుచ్చుకోవడం ద్వారా పెట్టుబడి ఖర్చులను తగ్గించుకుని,అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి చెర్రిన్ గగన్ నర్సారెడ్డి,ఇఫ్కో మేనేజర్ బాలవికాస్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం.. క్షేత్రస్థాయిలోనే పరిశీలన!19వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత పర్యటన.. సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు

**పెన్ పవర్,అక్టోబర్ 15:**

మధిర: అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజా సమస్యల మూలాలను గుర్తించి, శాశ్వత పరిష్కారం చూపాలని మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత స్పష్టం చేశారు. పట్టణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు.15.09.26 మధిర మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో ఆమె పర్యటించారు. వైస్ చైర్మన్ కోనధని కుమార్, కౌన్సిలర్ యన్నం శెట్టి



అప్పారావు, మున్సిపల్ కమిషనర్ శామ్యూల్ పాల్, వివిధ శాఖల అధికారులతో కలిసి వార్డులోని వీధులు, గల్లీల్లో కాలినడకన పర్యటించి స్థానిక సమస్యలను స్వయంగా పరిశీలించారు. ప్రజలు ఎదుర్కొంటున్నఇబ్బందులనుస్థానికులు,కౌన్సిలర్‌ను అడిగి తెలుసుకున్నారు.వార్డులో తాగునీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుద్ధ్యం తదితర సమస్యలపై అధికారులతో చర్చించారు. పేరుకుపోయిన సమస్యలనుతక్షణమేపరిష్కరించాలని ఆదేశించారు. దెబ్బతిన్న రహదారుల సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.ఈ పర్యటనలోకౌన్సిలర్‌రమణనాయక్,వివిధశాఖలఅధికారులు,మున్సిపల్‌సిబ్బందిపాల్గొన్నారు.

# కొండలమ్మ మహా అన్నసమారాధన విరాళాలకు ఆహ్వానం...

**పెన్ పవర్,అక్టోబర్ 15:**

మండలం వేమవరం గ్రామంలో వెంచేసిన శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో శ్రీ దేవి శరన్నవరాత్రుల సందర్భంగా ఈ నెల 18వ తేదీన జరుగు మహా అన్నసమారాధనకు ధన, వస్తువుల రూపేణా విరాళాలను ఆహ్వానిస్తున్నట్లు దేవస్థాన చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్‌రావు, ఈఓ ఆకుల కొండలరావు కోరారు. గురువారం మహా అన్నసమారాధన నిమిత్తం హైదరాబాద్ వాస్తవ్యులు వేణుగోపాలాచార్యులు 250 కేజీలు, మరొక భక్తుడు 100 బియ్యం విరాళంగా ఇచ్చారని పేర్కొన్నారు. వారిని చైర్మన్ మోహన్, ఈఓ కొండలరావు సత్కరించి ప్రసాదం అందజేశారు. ఈ మహా అన్నసమారాధనకు ధన, వస్తువుల రూపేణా విరాళాలను సమర్పించే దాతలు తప్పనిసరిగా రశీదు తీసుకోవలసిందిగా కోరారు.



# వీఆర్‌ఏలు తాత్కాలిక సమ్మె విరమణ...

**పెన్ పవర్,అక్టోబర్ 15:**

గ్రామ రెవిన్యూ సహాయకుల కోర్కెలను ప్రభుత్వం నెరవేర్చకుండా పోయింది. ఎన్నికల నోటిఫికేషన్ రావటంతో వారు చేస్తున్న సమ్మెను విరమిస్తూ గురువారం డీటీ రత్నకుమారికి లేఖను అందించారు. 29రోజులుగా చేసిన సమ్మెను నోటిఫికేషన్ అనంతరం నిర్వహించనున్నామని వీఆర్‌ఏల సంఘ గుడ్లవల్లేరు మండల అధ్యక్షుడు ఉడుముల రవికుమార్, ఆ సంఘ నాయకులు చార్లెస్, కిరణ్, ఫైజుల్లా, ఆదర్శ్ తెలిపారు.



# మహబూబాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**పెన్ పవర్,అక్టోబర్ 15:**

మహబూబాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కొరకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ రెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు.

డి.ఎం.ఎస్.టి, డి.ఇ.సి.జి కోర్సులలో ప్రతి దాంట్లో ఉన్న 30 సీట్లకు గాను. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలని అన్నారు.అభ్యర్థులు తమ దరఖాస్తులను www.tgpmb.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా 24.10.2026 సాయంత్రం 05:00 గంటల లోపు నమోదు చేసుకోవాలని అన్నారు.

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రింటౌట్‌తో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక సెట్ స్వయం ధృవీకరణ (Self attestation) చేసిన జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు మరియు 100 రూపాయల నగదు రుసుమును జతపరిచి 24.10.2026 సాయంత్రం 05:00 గంటల లోపు మహబూబాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో అందజేయాలని అన్నారు.




దరఖాస్తులో తప్పుడు సమాచారం నమోదు చేసినా లేదా సంబంధిత ధ్రువపత్రాలు జతపరచకపోయినా దరఖాస్తులు తిరస్కరించబడతాయన్నారు

దరఖాస్తు ఫారం, పూర్తి నిబంధనలు మరియు ఇతర సూచనల కోసం అధికారిక వెబ్‌సైట్ www.tgpmb.telangana.gov.in సందర్శించగలరని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

# మాసన్న కు మెరుగైన వైద్యం కోసం ఎల్. ఓ. సి అందజేసిన డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి మాజీ మంత్రి



**పెన్ పవర్,అక్టోబర్ 15:**

వనపర్తి పట్టణం 6 వ వార్డుకు చెందిన రంగం మాసన్న అనారోగ్యంతో నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స తీసుకుంటూ మెరుగైన వైద్యం కోసం ఎల్. ఓ. సి కావాలని మాజీ మంత్రివర్యులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి కి విన్నవించుకోగా మాసన్న కు రెండు రోజుల్లోనే చిన్నారెడ్డి రెండు లక్షల 50 వేల ఎల్.ఓ.సీ ని అందజేశారు.

చిన్నారెడ్డి మాట్లాడుతూ

అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సకాలంలో వైద్యం అందించడం ఎంతో ముఖ్యమని అన్నారు.

ఆరోగ్య సమస్యల కారణంగా పేద కుటుంబం కూడా ఇబ్బందులు పడకూడదన్నదే తమ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

మాసన్న మెరుగైన వైద్య సేవలు ద్వారా ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు

సమయానికి ఎల్.ఓ.సి కాఫీ అందడంతో తీవ్రమైన ఆర్థిక ,అరోగ్య ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబం ఆనందం వ్యక్తం చేస్తూ చిన్నారెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# నాగర్ కర్నూల్ లో రమణ70/ఎఎ నూతన థియేటర్ ప్రారంభించిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి





**పెన్ పవర్,అక్టోబర్ 15:**

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో గురువారం రమణ 70/mm A/c నూతన దియేటర్ ను స్థానిక ఎమ్మెల్యే డా.కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనందం కోసం సినిమాలు సినిమా హాలు ఎంతో ఆనందపరుస్తాయని అన్నారు.ఈ ప్రారంభోత్సవంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు గారు,మున్సిపల్ ఛైర్మెన్ తీగల సునేంద్ర గారు,వైస్ చైర్మన్ బాదం రమేష్ గారు,కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు

# బురాన్ పురం దుర్గామాతను దర్శించుకున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్



**పెన్ పవర్,అక్టోబర్ 15:**

డోర్నకల్ నియోజకవర్గ, మరిపెడ మండలం బురాన్ పురం గ్రామంలో దేవీ నవరాత్రుల సందర్భంగా కొలువుదీరిన దుర్గామాతను మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యవతి రాథోడ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు సమర్పించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రజలపై దుర్గామాత ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు.

భక్తి శ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అమ్మవారిని దర్శించుకుని సత్యవతి రాథోడ్ ప్రత్యేక పూజలు చేయడం పట్ల స్థానిక భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

# శ్రీపురం గ్రామంలో ఉచిత పశు గర్భకోశ చికిత్స మరియు పశు ఆరోగ్య శిబిరం

**పెన్ పవర్,అక్టోబర్ 15:**

నాగర్ కర్నూల్ మండలంలోని శ్రీపురం గ్రామంలో పశు గణాభివృద్ధి సంస్థ మరియు పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పశువైద్య అధికారి డా. పి. అశోక్ నేతృత్వంలో ఉచిత పశు గర్భకోశ చికిత్స మరియు పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు.ఈ శిబిరానికి పెద్ద సంఖ్యలో పశువులు తరలిరాగా, పశువులకు గర్భకోశ సంబంధిత చికిత్సలు మరియు గర్భ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కూచుకుల్ల గీత తాడూరు మండల డాక్టర్ ప్రవీణ్ , గోపాలమిత్ర సూపర్వైజర్ గోపాల్,



గోపాలమిత్ర రాజేందర్ రెడ్డి, పశువైద్య సిబ్బంది మాద్య నాయక్, వినయ్, సనా సుల్తానా, మక్బూల్ మరియు పలువురు రైతులు పాల్గొన్నారు.

# అమ్మవారి అలంకరణకు రామచంద్ర రెడ్డి 35000 వితరణ

**పెన్ పవర్,అక్టోబర్ 15:**

లక్కీరెడ్డిపల్లి విశ్వభారతి స్కూల్ వద్ద వున్నా సర్వమాంగళదేవి కీ ఎంఎల్ రామచంద్రారెడ్డి వారి ధర్మపత్ని వెంకట గిరిజమ్మ సర్వమంగళ దేవి అమ్మవారికి మహాలక్ష్మి అలంకారం కోసం 35 వేల రూపాయలు అమ్మవారికి సమర్పించారు అర్చకులు హరి మాట్లాడుతూ రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులకు అమ్మవారి స్వామివారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆశీర్వదిస్తూ శ్రీహరి స్వామి శతమానం భవతి శతమైశ్వర్యం భవతి శతాయుష్మ పురుషంద్రియే ఆయుష్ దేవేంద్రియే ప్రతితిష్ఠతి రేలాకు గోత్ర దినదినాభివృద్ధిరస్తు అని తెలిపారు

# శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ తూమొల్ల దత్తాత్రి

**పెన్ పవర్,అక్టోబర్ 15:**

భైంసా పట్టణ పరిధిలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. పట్టణంలోని ప్రతి గల్లీలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. భక్తి పారవశ్యంతో భక్తులు అమ్మవారిని దర్శించుకుంటూ, ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

ఈ సందర్భంగా భైంసా మున్సిపల్ చైర్మన్ తూమొల్ల దత్తాత్రి పట్టణంలోని పలు దుర్గా మండపాలను సందర్శించి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక హారతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండపాల వద్ద నిర్వాహకులు, భక్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండి, ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. పట్టణంలో నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరుగుతున్నాయని, నిర్వాహకులకు, భక్తులకు, పోలీస్ యంత్రాంగానికి అభినందనలు తెలిపారు. మున్సిపాలిటీ తరపున మండపాల వద్ద పారిశుద్ధ్యం, త్రాగునీరు, లైటింగ్ వంటి సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పట్టణంలో ఏర్పాటు చేసిన అన్ని మండపాలను సందర్శించి, అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొంటూ భక్తి భావాన్ని చాటుతున్నారని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు తాలోడ్ శ్రీనివాస్, నిమ్మల



ప్రవీణ్, వడ్నపు శ్రీనివాస్, సుభాష్ తదితరులు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ స్పెషల్ రివిజన్ కార్యక్రమం



- రీ సర్వే కార్యక్రమాన్ని , మండల కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లలో ఆకస్మికంగా తనిఖీలు.
- జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్.



**పెన్ పవర్,అక్టోబర్ 15:**

జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్, మండలంలోని బొద్దుగొండ, మదనాపురం గ్రామాలలో విస్తృతంగా పర్యటించారు.

గురువారం, శుక్రవారం జరిగే స్పెషల్ ఇండెన్సివ్ రివిజన్, సర్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో నిర్వహిస్తున్న ఓటరు జాబితా సవరణ మార్పులు, చేర్పులను స్వయంగా పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు.

మదనాపురం గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం సర్వేను కొనసాగించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా ముందస్తు సమాచారం అందించాలని, రైతును కూడా తమ భూముల యొక్క హద్దులను ముందుగా స్థిరపరచుకోవాలని తద్వారా సర్వే సులభంగా పారదర్శకంగా కొనసాగుతుందని కలెక్టర్ సూచించారు.

ప్రస్తుత ఎల్నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు పంట మార్పిడి విధానం వైపు మొగ్గుచూపాలని నీటి వాడకం తక్కువగా ఉండే పంటలను వేయాలని రైతులకు సూచించారు.

విబిజి రాంజీ ఉపాధి హామీ పథకం కింద రైతులకు వివిధ పనులను అప్పగించాలని సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్ ను ఆదేశించారు.

మండలంలో సాగునీరు, త్రాగునీరు సరఫరా లో ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా అర్హత కలిగిన రైతులందరికీ పంట రుణాలను అందించాలని కలెక్టర్ తెలిపారు.

'సర్' తుది జాబితాలో చోటుకు మరో అవకాశం

అక్టోబర్, 15,16 తేదీలలో అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక శిబిరాలు

ఈ ఏడాది నవంబరు 9న ప్రకటించనున్న 'సర్' ఓటరు తుది జాబితాలో తమ పేరు చేర్చుకోవడానికి పౌరులకు కేంద్ర ఎన్నికల సంఘం మరో అవకాశం ఇచ్చిందని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ నేడు ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

ఇందులో భాగంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో ఈ నెల 15, 16వ తేదీల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తోందని ఇందులో కొత్త ఓటరుగానూ నమోదు చేసుకోవచ్చని ముసాయిదా జాబితా ప్రచురణలో భాగంగా ఏఎస్డీడీ(అబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్ అండ్ డూప్లికేట్) పేరుతో తొలగించిన 73 లక్షల ఓటర్లకు సైతం మరో అవకాశం కల్పించిందని అన్నారు.

ఎక్కడైనా పొరపాటున ఈ జాబితాలో చేరిన ఓటర్లు కూడా ఈ శిబిరాలలో ఫారం-6ను సమర్పించవచ్చునని అన్నారు.

ఈ రెండు రోజుల్లో ఫారం-6 సమర్పించిన వారి పేర్లను నవంబరు 9న ప్రచురించే తుది జాబితాలో చేర్చడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. వాస్తవానికి 'సర్'లో భాగంగా ఫిర్యాదులు, అభ్యంతరాల సమయంలో ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి గత ఆగస్టు 17 నుంచి ఈ నెల 7వ తేదీ వరకే వెసులుబాటు కల్పించారు. ఈ గడువు ముగియడంతో 'సర్' తుది జాబితాలో అవకాశం లేకుండా పోయిందని, అయితే ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో 15, 16వ తేదీల్లో ఫారం-6 ఇవ్వడానికి కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం ఇచ్చినందున ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

అనంతరం మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేసి పిల్లల వార్డు, స్త్రీ, పురుషుల వార్డులను స్వయంగా తనిఖీ చేసి మందుల స్టోర్ గదిని, ఓపి రిజిస్టర్, హాజరు పట్టిక, సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేశారు.

వైద్యులు సిబ్బంది సమయపాలన పాటించాలని, నిత్యం సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని, తగినన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరు మీ ప్రమాణం యాప్ లో తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

వార్డులలో చికిత్స పొందుతున్న పిల్లలు, పేషెంట్లను ఆప్యాయశీగా పలకరిస్తూ వారికి అందుతున్న సేవల గురించి వివరాలు తెలుసుకున్నారు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పరిధిలోని అన్ని సబ్ సెంటర్ల వారిగా సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని,ప్రభుత్వం ప్రవేశపెట్టే వైద్య కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం ప్రజలకు అందించాలని కలెక్టర్ తెలిపారు. విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రతి ఒక్కరు సమయపాలన పాటించాలన్నారు.

హాస్పటల్లోని ఎక్సరే, ల్యాబ్, ఇతర సౌకర్యాలు కల్పించాలని అన్నారు.

ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ చీర శ్రీనివాసులు, స్థానిక తహసిల్దార్ నాగ భవాని , రెవెన్యూ ఇన్స్పెక్టర్ నరేష్ రెడ్డి, సర్వేయర్లు తదితరులు ఉన్నారు.

# ప్రతి విద్యార్థి ఉన్నతికి ఉపాధ్యాయులు బాధ్యతగా పనిచేయాలి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**పెన్ పవర్,అక్టోబర్ 15:**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి విద్యాపరంగా ఉన్నత స్థాయికి చేరుకునేలా ఉపాధ్యాయులు బాధ్యతగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు.

**గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖపై నిర్వహించిన సుదీర్ఘ సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు.**

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులు, విద్యార్థుల క్రమం తప్పని హాజరుతోనే ప్రభుత్వ విద్యావ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు, విషయ పరిజ్ఞానం, అవగాహన సామర్థ్యాలను పెంపొందించేలా బోధన కొనసాగించాలని సూచించారు. తరచూ పాఠశాలకు గైర్హాజరవుతున్న విద్యార్థులను గుర్తించి, వారి తల్లిదండ్రులతో మాట్లాడి గైర్హాజరుకు గల కారణాలను తెలుసుకోవాలని, వారు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బోర్డు పరీక్షలకు విద్యార్థులను ఇప్పటి నుంచే స్పష్టమైన ప్రణాళికతో సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. నిర్ణీత గడువులోగా సిలబస్‌ను పూర్తి చేసి, ప్రతి సబ్జెక్టును విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునే విధంగా బోధించాలని అన్నారు. విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ, పరీక్షల్లో మెరుగైన ఫలితాలు



సాధించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతిరోజూ నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందేలా పర్యవేక్షించాలని తెలిపారు. పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి విద్యార్థికి ఆధార్ కార్డు ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**విద్యార్థుల కోసం 'అభ్యాస దీపిక' వెబ్‌సైట్ రూపకల్పనపై ప్రధానోపాధ్యాయుడికి అభినందన**

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం 'అభ్యాస దీపిక' వెబ్‌సైట్‌ను రూపొందించిన ప్రధానోపాధ్యాయుడు మునిందర్ రాజును జిల్లా కలెక్టర్ అభినందించారు.

గణితం తదితర సబ్జెక్టులను విద్యార్థులు సులభంగా అర్థం



చేసుకునేలా పాఠాలు, మెళకువలు, అభ్యాస విధానాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రత్యేక చొరవతో వెబ్‌సైట్‌ను రూపొందించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి దోహదపడే ఇలాంటి వినూత్న ఆలోచనలు, సాంకేతిక పరిజ్ఞాన ఆధారిత కార్యక్రమాలను మరింత మంది ఉపాధ్యాయులు చేపట్టాలని ఆయన సూచించారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, ఎంఈఓలు, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారుపరిజ్ఞాన ఆధారిత కార్యక్రమాలను మరింత మంది ఉపాధ్యాయులు చేపట్టాలని ఆయన సూచించారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, ఎంఈఓలు, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్పిరిట్యువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతన ధ్యాన మందిర పిరమిడ్ నిర్మాణానికి నిర్వహించిన భూమిపూజ, శంకుస్థాపన లో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం

**పెన్ పవర్,అక్టోబర్ 15:**

పోచంపల్లి పట్టణంలో స్పిరిట్యువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతన ధ్యాన మందిర పిరమిడ్ నిర్మాణానికి నిర్వహించిన భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్న

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, నేటి జీవితంలో ప్రతి ఒక్కరికీ మానసిక ప్రశాంతత ఎంతో అవసరమని పేర్కొన్నారు. ధ్యానం మనస్సును ప్రశాంతంగా ఉంచడంతో పాటు ఏకాగ్రతను పెంపొందించడానికి, ఒత్తిడిని తగ్గించుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ధ్యానానికి కొంత సమయం కేటాయించాలని సూచించారు.

పోచంపల్లిలో నూతన ధ్యాన మందిర పిరమిడ్ నిర్మాణం పూర్తయి ప్రజలకు ఉపయోగపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ది పోచంపల్లి స్పిరిట్యువల్ ట్రస్ట్ ప్రతినిధులను అభినందించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు,వైస్ ఛైర్పర్సన్ కొయ్యడ రజిని - శ్రీనివాస్,పోచంపల్లి, జూలూరు పిఏసిఎస్ చైర్మన్లు పాక మల్లేష్ యాదవ్, కళ్లెం రాఘవరెడ్డి,చేనేత సహకార సంఘ అధ్యక్షులు భారత లవకుమార్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు సామ మధు ,పట్టణ&మండల కాంగ్రెస్ అధ్యక్షులు వంగూరి పాండు,ఉప్పునూతల వెంకటేష్ యాదవ్,కౌన్సిలర్లు, కో అప్షన్ సభ్యులు,ట్రస్ట్ ప్రతినిధులు, నిర్వాహకులు, ఇతర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# వల్లభనేని వంశీ 2.0.. మళ్లీ మొదలు పెట్టేసిన మాజీ ఎమ్మెల్యే!



**విజయవాడ అక్టోబరు 15 పెన్ పవర్:** వైసీపీ కీలకనేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ మళ్లీ తన పాత పంథాలో రాజకీయంగా దూకుడు చూపుతున్నారు. స్థానిక ఎన్నికల్లో పార్టీని విజయ తీరాలకు చేర్చే బాధ్యతను భుజానికెత్తుకున్న వంశీ వరుసగా కేడర్ తో సమావేశాలు నిర్వహిస్తూ ధైర్యం నూరుపోస్తున్నారు. ఈ క్రమంలో ఊడత ఊపులకు తాటాకు చప్పుళ్లకు ఎవరూ భయపడరన్నట్లుగా వ్యాఖ్యలు చేస్తున్నారు. తనకు భయం లేదని, తన అనుచరులు కూడా భయపడొద్దు అంటూ వంశీ చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశం అవుతున్నాయి.

స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో వంశీ వరుసగా కార్యకర్తలతో సమావేశం అవుతున్నారు. ఈ క్రమంలో ఆయన చేస్తున్న వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గత ప్రభుత్వంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుపై తీవ్రస్థాయిలో విమర్శలు చేయడం ద్వారా వంశీ కూటమి ప్రభుత్వానికి టార్గెట్ అయ్యారని చెబుతున్నారు. దీంతో కూటమి గెలిచిన వెంటనే ఆయన కొంత తగ్గినట్లు కనిపించినా, ప్రస్తుతం మళ్లీ పూర్తిస్థాయిలో రాజకీయాలు చేస్తూ తన దూకుడును కొనసాగిస్తున్నారని అంటున్నారు.

గన్నవరం నియోజకవర్గంలో వరుస కార్యక్రమాల్లో వంశీ చేస్తున్న వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి. రెండు రోజుల క్రితం తనను లోపల వేసిన వాడిని లోపలికి పంపిన నాయకుడు తనతో ఉన్నాడని చెబుతూ తనకు అండదండగా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఉన్నారని, ఆయన కోసం తాను తెగించి పనిచేస్తానని స్పష్టం చేసినట్లుగా భావిస్తున్నారు. ఇక తాజాగా కూడా మాజీ సీఎం జగన్ రెడ్డి గొప్పతనాన్ని చాటిచెబుతూ వంశీ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలుగు రాష్ట్రాల్లో పార్టీని పెట్టి అధికారంలోకి వచ్చిన నాయకులు ముగ్గురే ఉన్నారని చెబుతూ, ఆ ఘనత సాధించిన నేతలుగా ఎన్టీఆర్, కేసీఆర్, జగన్ రెడ్డి పేర్లను ప్రస్తావించారు.

తెలుగు రాష్ట్రాల్లో ఎందరో పార్టీలు పెట్టినా అధికారంలోకి రాలేకపోయారని, కానీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి మాత్రం తన విస్తృత జనాకర్షణతో పార్టీని గెలిపించుకోగలిగారని వంశీ కొనియాడారు. మళ్లీ జగన్ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఇక ఇదే సమయంలో ఆయన బెదిరింపులకు లొంగేది లేదు అన్నట్లు చేసిన వ్యాఖ్యలు అగ్గిరాజేస్తున్నాయి. ఇప్పటికే పలు కేసుల ఎదుర్కొని, జైలుకు వెళ్లి వచ్చిన వంశీ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం ద్వారా కూటమి ప్రభుత్వాన్ని, ప్రభుత్వ పెద్దలను తన ట్రాప్ లోకి లాగే ప్రయత్నం చేస్తున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. తన విమర్శలకు సమాధానం చెప్పలేని విధంగా మాటల బాణాలు విసరడం ద్వారా ప్రజల్లో తన పట్ల సానుభూతి పెంచుకోవాలని వంశీ వ్యూహంగా ఉందని అంటున్నారు. ఒకవేళ కూటమి ప్రభుత్వం మళ్లీ కేసులు నమోదు చేయించి అరెస్టు చేసేందుకు ప్రయత్నించినా, అది తనకు అనుకూలంగా మారుతుందని ఆయన భావిస్తున్నట్లుగా కనిపిస్తోందని అంటున్నారు. లేనిపక్షంలో తన మాటలతో వైసీపీ కార్యకర్తల్లో ఉత్తేజం నింపి ప్రభుత్వంపై దూకుడుగా పోటీ చేసేందుకు పనికొస్తుందన్న ఆలోచన కూడా ఉండొచ్చని అంటున్నారు. మొత్తానికి మాజీ ఎమ్మెల్యే వల్లభనేని తాజా వ్యూహం రాజకీయంగా ఆసక్తి రేపుతోందని అంటున్నారు.

# మంత్రివర్గం రేసులో మహిళా నేత.. లక్కు చిక్కేనా ..!



**విజయవాడ అక్టోబరు 15 పెన్ పవర్:** బీసీ సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇస్తున్న సీఎం చంద్రబాబు... స్థానిక సంస్థలే కాదు తన మంత్రివర్గంలోనూ బీసీలకు పెద్దపీట వేయాలని భావించారు. ఈ క్రమంలోనే బీసీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలకు ఈ దఫా మంత్రులుగా అవకాశం కల్పించాలని ఇప్పటికే సమీక్షలు ప్రారంభించారు. అంతర్గతంగా పార్టీ సేకరించిన రిపోర్టులతో పాటు వ్యక్తిగతంగా చంద్రబాబు ఆయా జిల్లాల్లో పర్యటించినప్పుడు నాయకుల పనితీరును చూసి వేసుకున్న అంచనాలను కూడా ఇప్పుడు సమీక్షిస్తున్నారు. తద్వారా నాయకులను మంత్రులుగా ఎంపిక చేసే విషయంపై దృష్టి పెట్టారు.దీనిలో ప్రధానంగా మహిళలకు ఎక్కువగా అవకాశం ఇవ్వాలన్నది చంద్రబాబు ఆలోచనగా ఉంది. తద్వారా మహిళా ఓటు బ్యాంకు ను ఆకర్షించాలని చూస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సుమారు రెండు కోట్ల మందికి పైగా మహిళా ఓటర్లు ఉన్నారు. వీరిలో మెజారిటీ భాగం బీసీ సామాజిక వర్గానికి చెందిన వారే కావడం, ఆ వర్గం వైపు టిడిపి ఎక్కువగా ఆశలు పెట్టుకున్న నేపథ్యంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళ ఎమ్మెల్యేలకు అవకాశం కల్పించాలని చంద్రబాబు ఒక నిర్ణయానికి వచ్చారు. ఈ క్రమంలో తాజాగా ఒక మహిళ ఎమ్మెల్యే పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.ఆవిడే గుంటూరు కు చెందిన గళ్ళ మాధవి. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో తొలిసారి విజయం సాధించిన మాధవి ఇటు పార్టీ పరంగా అటు వ్యక్తిగతంగా కూడా దూసుకుపోతున్నారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారం విషయంలో కానీ ప్రజలకు అందుబాటులో ఉండే విషయంలో కానీ మాధవి మంచి మార్కులు సంపాదించుకున్నారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల కాలంలో ఆమెను పార్టీ పొలిట్ బ్యూరోలోకి కూడా తీసుకున్నారు. ప్రధానంగా వైసిపి నేతలపై విరుచుకు పడడంలో ఈ విధంగా కౌంటర్లు ఇవ్వడంలో కూడా మాధవి ముందున్నారన్నది పార్టీ వర్గాలు చెబుతున్న మాట.

ఈ క్రమంలోనే చంద్రబాబు సైతం ఆమె వైపు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. రజక సామాజిక వర్గానికి చెందిన మాధవికి మంత్రివర్గంలో అవకాశం కల్పించే విషయంపై చంద్రబాబు పరిశీలిస్తున్నట్టుగా పార్టీ వర్గాల నుంచి అత్యంత విశ్వసనీయ సమాచారం వైరల్ గా మారింది. మాధవికి అన్ని అర్హతలు ఉన్నాయని, ఇటు ప్రజల్లోనూ అటు పార్టీలోనూ మంచి పేరు ఉందని సమస్యలపై స్పందిస్తున్నారని సమస్యల పరిష్కారంతోపాటు అభివృద్ధి పనులు చేపట్టడం అదేవిధంగా ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లడంలోనూ మాధవి నిరంతరం కృషి చేస్తున్నారని చంద్రబాబు ప్రగాఢంగా విశ్వసిస్తున్నారు.

ఈ నేపథ్యంలోనే బీసీ సామాజిక వర్గంలో మరింత ఇమేజ్ పెంచుకునేందుకు మాధవికి అవకాశం ఇవ్వాలన్న నిర్ణయం దిశగా చంద్రబాబు అడుగులు వేస్తున్నట్టు సీనియర్ నాయకుల మధ్య చర్చ సాగుతోంది. అదేవిధంగా ఈసారి రాయలసీమ నుంచి మరో మహిళను బీసీ సామాజిక కోటాలో మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇక ఉత్తరాంధ్ర నుంచి కూడా బీసీ సామాజిక వర్గానికి చెందిన మరో మహిళను కూడా తీసుకుంటారని అంటున్నారు మరి ఏం జరుగుతుందనేది చూడాలి.

# రాష్ట్రపతి డిజిటల్ పేమెంట్.. సరస్ మేళాలో ద్రౌపది ముర్ము స్పెషల్ అట్రాక్షన్



**విజయవాడ అక్టోబరు 15 పెన్ పవర్:** సామాన్యుల నుంచి సంపన్నుల వరకు.. చిల్లర వ్యాపారి నుంచి పెద్ద పెద్ద మాల్స్ వరకు.. నేడు దేశంలో ఎక్కడ చూసినా 'యూపీఐ పేమెంట్లు' సర్వసాధారణమైపోయాయి. రూపాయి బిల్ల అవసరం లేకుండా కేవలం ఒకే ఒక్క క్యూఆర్ కోడ్ స్కాన్ తో క్షణాల్లో చెల్లింపులు చేసే సాంకేతికత ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగమైంది. డిజిటల్ విప్లవంలో దేశ ప్రథమ పౌరురాలే స్వయంగా భాగస్వామ్యం కావడం విశేష ఆకర్షణగా నిలిచింది. విజయవాడలో జరుగుతున్న 'సరస్ మేళా'ను సందర్శించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, అక్కడ ఒక స్టాల్‌లో చీర కొనుగోలు చేసి, తన మొబైల్ ద్వారా యూపీఐ పద్ధతిలో నగదు చెల్లించి అందరినీ ఆశ్చర్యపరిచారు.

విజయవాడ వేదికగా జరుగుతున్న జాతీయ సరస్ మేళా ప్రదర్శనకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విచ్చేశారు. ఈ సందర్భంగా మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను ఆమె ఆసక్తిగా పరిశీలించారు. అక్కడి హస్తకళలు, చేనేత వస్త్రాల ప్రత్యేకతలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలోనే ఒక స్టాల్‌లో తనకు నచ్చిన చీరను కొనుగోలు చేశారు. బిల్లు చెల్లించే సమయాన తన మొబైల్ ఫోన్ తీసి క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేశారు. యూపీఐ ద్వారా క్షణాల్లో చెల్లింపులు పూర్తి చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు.దేశ సర్వోన్నత పీఠంలో ఉన్న రాష్ట్రపతి స్వయంగా డిజిటల్ పేమెంట్ చేయడం డిజిటల్ ఇండియా సాధిస్తున్న విజయానికి నిలువెత్తు నిదర్శనంగా చెబుతున్నారు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఆర్బీఐ కలసి 2016 ఏప్రిల్ 11న యూపీఐ వ్యవస్థను ప్రారంభించాయి. కేవలం కొన్ని బ్యాంకులతో ప్రారంభమైన ఈ ప్లాట్‌ఫామ్ నేడు దేశ ఆర్థిక వ్యవస్థనే మార్చివేసిందని అంటున్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరిగే మొత్తం డిజిటల్ రియల్-టైమ్ లావాదేవీలలో దాదాపు 50% వాటా మన దేశానిదే కావడం విశేషంగా చెబుతున్నారు. ప్రతి నెలా వందల కోట్ల లావాదేవీలు యూపీఐ ద్వారా జరుగుతున్నాయి. చిన్న వ్యాపారులు, కూరగాయల అమ్మకందారుల నుంచి పెద్ద వ్యాపారాల వరకు ప్రతి లావాదేవీ డిజిటల్ రూపంలోనే సాగుతోంది.

యూపీఐ సాంకేతికత ఇక్కడితో ఆగడం లేదు. రాబోయే రోజుల్లో ఇది మరింత సంచలనాత్మక మార్పులు తేనుందని చెబుతున్నారు. ఏఐ ఆధారిత వాయిస్ కమాండ్ల ద్వారా మాటలతోనే సులువుగా చెల్లింపులు చేసే సదుపాయం రాబోతోందని నిపుణులు చెబుతున్నారు. సింగపూర్, యూఏఈ, ఫ్రాన్స్, శ్రీలంక వంటి అనేక దేశాల్లో ఇప్పటికే యూపీఐ అందుబాటులోకి రాగా, భవిష్యత్తులో ప్రపంచమంతటా భారతీయులు కరెన్సీ మార్పిడి లేకుండా నేరుగా చెల్లింపులు చేయవచ్చు. అలాగే ఇంటర్నెట్ లేని మారుమూల ప్రాంతాల్లోనూ ఫీచర్ ఫోన్ల ద్వారా నేరుగా లావాదేవీలు జరిపేలా సాంకేతికత విస్తరిస్తోంది. విజయవాడ మేళాలో రాష్ట్రపతి డిజిటల్ చెల్లింపు చేయడం నుంచి గ్రామీణ మహిళలు క్యూఆర్ కోడ్ స్కానర్లు వాడడం వరకు.. భారత్ ఎంత వేగంగా డిజిటల్ వైపు అడుగులు వేస్తోందో స్పష్టమవుతోంది. ఆర్థిక పారదర్శకతకు, సులువైన జీవనానికి యూపీఐ వేసిన బాట భవిష్యత్తులో భారత్‌ను మరింత బలమైన డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా మార్చుతుందని అంటున్నారు.

# యార్లగడ్డ మాస్ రియాక్షన్.. గన్నవరం అప్పుడే గరం.. గరం..



**విజయవాడ అక్టోబరు 15 పెన్ పవర్:** స్థానిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ప్రధానంగా కొన్ని కీలక నియోజకవర్గాల్లో ఈ వేడి మరింత ఎక్కువగా కనిపిస్తోంది. రాష్ట్ర రాజకీయ రాజధాని విజయవాడ నగరంలో అంతర్భాగమైన గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రస్తుతం చోటుచేసుకుంటున్న రాజకీయాలు మరింత ఆసక్తిని కలిగిస్తున్నాయి. ఈ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే, వైసీపీ కీలక నేత వల్లభనేని వంశీ కొద్దిరోజులుగా హడావుడి చేస్తుండగా, ఆయనకు కౌంటరుగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు రంగంలోకి దిగారు.స్థానిక ఎన్నికలకు వైసీపీ క్యాడర్ ను సన్నద్ధం చేసేందుకు వరుస సమావేశాలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ తమ పార్టీ అధినేత జగన్మోహనరెడ్డికి హైప్ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారని చెబుతున్నారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టు విషయాన్ని ఎత్తిచూపుతూ.. రెండు రోజుల క్రితం కీలక వ్యాఖ్యలు చేశారు. తనను లోపల వేసిన వారిని లోపలకు పంపిన వాడు తనతో ఉన్నాడంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అండదండలు ఉన్నాయని, తాను ఎవరికీ భయపడనని మాజీ ఎమ్మెల్యే వంశీ మాట్లాడిన వీడియో వైరల్ అయిన విషయం తెలిసిందే.ఇక వంశీ వ్యాఖ్యలపై గన్నవరం సిట్టింగ్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకటరావు తీవ్రస్థాయిలో రియాక్ట్ అయ్యారు. వంశీ వెనక ఉన్నారని చెబుతున్న వ్యక్తే.. గతంలో అతడిపై తనను పోటీపెట్టాడని, వంశీ అరాచకాలను ఎదిరించాలని గన్నవరం టికెట్ ఇచ్చి పోటీకి పెట్టారని గుర్తు చేశారు. "నీ వెనుక ఉన్నవాడికి నీ గురించి తెలుసు.. నా గురించి తెలుసు. 2018లో బ్రహ్మలింగయ్య చెరువు ఒడ్డుమీద నీ వెనుక ఉన్నాయనే మట్టికాసుడు. రావణాసుడు, భూ బకాసురుడు అన్ని చెప్పిన వీడియో ఇప్పటికీ యూట్యూబ్ లో ఉంది. ఇప్పుడు అవన్నీ మరచిపోయి సుద్దపూస కబుర్లు చెబుతున్నావు" అంటూ ఎమ్మెల్యే యార్లగడ్డ మండిపడ్డారు.మాజీ ఎమ్మెల్యే వంశీ అవినీతిపరుడు అని మాజీ సీఎం జగన్మోహనరెడ్డి తనను అమెరికా నుంచి తీసుకువచ్చి గన్నవరంలో పోటీ చేయమని కోరిన విషయం మరచిపోయావా? అంటూ ప్రశ్నించారు. బుద్ధి, జ్ఞానం లేకుండా నిర్లజ్జగా మాట్లాడుతున్నారని యార్లగడ్డ ఫైర్ అయ్యారు. ప్రస్తుతం యార్లగడ్డ రియాక్షన్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కృష్ణా జిల్లాలో ఉన్న గన్నవరం నియోజకవర్గం తొలి నుంచి టీడీపీకి కంచుకోటగా ఉంది. ఇక్కడి నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వంశీ గత ప్రభుత్వంలో వైసీపీలో చేరగా, అప్పుడు ఆయనపై వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన యార్లగడ్డ వెంకటరావు 2024 అసెంబ్లీ ఎన్నికల ముందు టీడీపీలో చేరారు.

ఇక ఈ ఇద్దరు గత ఎన్నికల్లో మరోసారి ప్రత్యర్థులుగా తలపడగా, యార్లగడ్డ వెంకటరావు రికార్డు మెజార్టీతో గెలిచారు. అదేసమయంలో అంతకుముందు ఎన్నికల్లో ప్రత్యర్థులుగా తలపడిన ఈ ఇద్దరు ఇప్పుడు తమ పార్టీలను పార్టీ అధినేతలను పొగుడుతూ ప్రత్యర్థి పార్టీల నేతలను విమర్శిస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అప్పట్లో ఆయా పార్టీల అధినేతల మన్ననల కోసం పనిచేసిన నాయకులు ఇప్పుడు పార్టీలు మారి వారిపైనే విమర్శలు చేయడం ఆసక్తి రేపుతోంది. ఈ క్రమంలోనే గతంలో టీడీపీలో పనిచేసిన వంశీ అప్పట్లో తనను నెంబర్ వన్ ఎమ్మెల్యే అంటూ పొగిడేవారని చెప్పుకోగా, అప్పట్లో ఆయనపై మాజీ సీఎం జగన్ చేసిన విమర్శలను కూడా గుర్తుచేస్తూ ఎమ్మెల్యే వెంకటరావు చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీస్తున్నాయని చెబుతున్నారు.

# కూటమిలో కుంపటి.. టీడీపీకి జనసేన కొత్త టెన్షన్ పవన్ వ్యూహమేంటి?

**విజయవాడ అక్టోబరు 15 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించిన కూటమికి ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు కొత్త సవాళ్లు విసురుతున్నాయి. సీట్లు పంపకాల విషయంలో భాగస్వామ్యపక్షం జనసేన ఓ అడుగు ముందుకేసి దూకుడు పెంచింది. అసెంబ్లీ ఎన్నికల్లో 12శాతం సీట్లలో పోటీ చేసిన జనసేన ఇప్పుడు లోకల్‌బాడీల్లో 40శాతం సీట్లు కావాలని అడుగుతోంది. ఇది కేవలం ప్రచారం కాదు.. ప్రభుత్వంలో భాగంగా ఉన్న మంత్రులు, ఆ పార్టీ నేతలు బహిరంగంగానే మాకు కావాలసిన సీట్లు ఇన్నీ.. అని లెక్కలేసి మరీ ప్రకటించేశారు. పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ చేసిన ట్వీట్ కేవలం ఆయన అభిప్రాయంగా చెప్పలేం. అది కచ్చితంగా పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ మాటనే. దుర్గేష్ జారీ చేసిన జాబితా చూస్తే.. జనసేన పక్కా వ్యూహంతోనే ఉన్నట్లుగా ఉంది. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, వార్డుల స్థాయిలో మొత్తం స్థానాలను పరిగణనలోకి తీసుకుని.. సగటున 40 శాతం వాటాను జనసేన ప్రతిపాదిస్తున్నట్లుగా ఆ జాబితాలో చూపించారు. అందులో మేయర్లు, డిప్యూటీ మేయర్లు, స్టాండింగ్ కమిటీ పదవులు, వార్డు కౌన్సిలర్ల స్థానాలు కూడా ఉన్నాయి. 6 మేయర్ స్థానాలు, 6 డిప్యూటీ మేయర్ స్థానాలు, 44 మునిసిపల్ ఛైర్మన్లు, దాదాపు 2000 వార్డు మెంబర్లు కౌన్సిలర్ స్థానాలు వీరు కోరుతున్నారు.లోకల్ ఎన్నికలకు సంబంధించి టీడీపీకి అస్సలు ఊహలో కూడా లేని నెంబర్ ఇది. ప్రధాన పదవుల్లో 42శాతం, మొత్తం మీద 40శాతం పదవులను జనసేన అడుగుతోంది. ఇప్పుడు వీళ్లు ఇన్ని అడిగితే.. బీజేపీ కూడా అసెంబ్లీ ఎన్నికల వాటా కంటే కచ్చితంగా ఎక్కువగానే అడిగే అవకాశం ఉంది. దీనిని బట్టి సగం స్థానాలను టీడీపీ మిత్రపక్షాలకు వదలాల్సి ఉంది. దీనికి చంద్రబాబు సిద్ధంగా ఉన్నారా..? టీడీపీ శ్రేణులు దీనికి సమ్మతిస్తాయా అన్నది అసలు ప్రశ్నజనసేన స్థానిక ఎన్నికల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడం, క్షేత్రస్థాయిలో పార్టీ బలాన్ని అంచనా వేసి అభ్యర్థుల ఎంపికకు సిద్ధమవడం చూస్తే.. ఈసారి సీట్ల పంపకాలను తేలిగ్గా వదిలేయడానికి ఆ పార్టీ సిద్ధంగా లేదని అర్థమవుతోంది. గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సీట్ల సర్దుబాటు ఫార్ములానే స్థానిక ఎన్నికలకూ వర్తింపజేయలేమని జనసేన నేత నాదెండ్ల మనోహర్ చాన్నాళ్ల క్రితమే చెప్పారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోటీ చేసి అద్భుతమైన ఫలితాలు సాధించాయి. ఆ విజయంలో మూడు పార్టీల పాత్ర ఉన్నప్పటికీ, అసెంబ్లీ స్థానాల పరంగా టీడీపీ ప్రధాన భాగస్వామిగా నిలిచింది. ఇప్పుడు స్థానిక ఎన్నికల దగ్గరకు వచ్చేసరికి సమీకరణాలు మారుతున్నాయి. అప్పుడు జనసేనకు 12శాతం, బీజేపీకి 6శాతం సీట్లు ఇచ్చిన టీడీపీ 80కి పైగా స్థానాల్లో పోటీ చేసింది. అయితే అది ఇప్పుడు కుదరదు అని జనసేన తేల్చేసింది. టీడీపీపై ఒత్తిడి పెంచడానికి ముందు నుంచే ఎక్కువ సీట్లు కావాలని చెబుతోంది. ఇప్పటికే సీట్లు పంపకాలపై మూడు సార్లు సమావేశమైనప్పటికీ ఏ విషయం తేలలేదు. అంతేకాదు.. తమకు ఎన్నిసీట్లు కావాలో నేరుగా ఆన్‌లైన్‌లో పెట్టేయడం ద్వారా జనసేన ఇప్పుడు బాల్‌ను టీడీపీ కోర్టులోకి నెట్టేసింది. ఇప్పటి వరకూ కూటమిలో ఉన్న పొరపొచ్చాలను బయటకు రాకుండ సర్దుబాటు చేసుకుంటూ వస్తున్న చంద్రబాబుకు ఇది కచ్చితంగా కాస్త ఇబ్బంది కరమే..ప్రస్తుత పరిస్థితిని పవన్ కళ్యాణ్ తనకు అనుకూలంగా మార్చుకుంటున్నట్లు కనిపిస్తోంది. టీడీపీతో పొత్తు కారణంగా జనసేనకు అధికారంలో భాగస్వామ్యం లభించింది. కానీ స్థానిక సంస్థల్లోనూ పార్టీకి తగిన ప్రాతినిధ్యం లేకపోతే, కేడర్‌లో అసంతృప్తి పెరిగే ప్రమాదం ఉంది. అందుకే ఈసారి స్థానిక ఎన్నికలను జనసేన తన సంస్థాగత బలాన్ని పెంచుకునే అవకాశంగా దీనిని చూస్తుందనుకోవచ్చు. 40 శాతం వాటా ప్రతిపాదనపై కనుక ఆ పార్టీ సీరియస్‌గా నిలబడితే.. అది సాధారణ సీట్ల పంపకాల చర్చ కంటే పెద్ద రాజకీయ సంకేతమే అవుతుంది. లోకల్ బాడీ ఎన్నికల్లో పెద్ద వాటా తీసుకునేందుకే క్రమంగా జనసేన తమ నేరేటివ్‌ను బలపరుచుకుంటూ వచ్చింది. ముందుగా అంతర్గత కమిటీలు వేసి తమ పార్టీలో బలం ఎంత ఉంది.. ఎక్కడెక్కడ డిమాండ్ ఉందన్న విషయాన్ని చెప్పారు. ఆ తర్వాత నాదెండ్ల మనోహర్ తమ వైఖరి ఏంటో తెగ్గొట్టేశారు. ఇప్పుడు సరైన టైమ్‌లో "మాకు ఇన్నిసీట్లు కావాలి" అని తేల్చేశారు. పవన్ చాలా పకడ్బందీగా ఈ వ్యూహాన్ని అమలు చేసినట్లు కనిపిస్తోంది.పవన్ కళ్యాణ్- లోకేష్ పరస్పరం ఎంత సఖ్యతతో ఉంటారన్నది చాలా సార్లు కనిపించింది. అయితే వారిద్దరి మధ్య వచ్చిన కమ్యూనికేషన్ గ్యాప్.. కూటమిలో కాస్త వేడిపుట్టించిందని సమాచారం. ఈ మధ్య కాలంలో పనవ్ కళ్యాణ్ కూటమి నేతలతో అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ప్రచారం, లోకేశ్‌తో దూరం పెరుగుతోందన్న చర్చలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నా.. వీటిని నిర్ధారించే స్పష్టమైన ఆధారాలు కనిపించడం లేదు. కానీ ఎక్కడో తేడా వచ్చిందనే మాటలైతే.. వినిపిస్తున్నాయి.

### విజయ్ పర్యటనలో పవన్ కళ్యాణ్ మిస్సింగ్

తమిళనాడు ముఖ్యమంత్రిగా తొలిసారి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన విజయ్ పర్యటన రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్ అయింది. అయితే విజయ్ పర్యటనలో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎక్కడా కనిపించకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. విజయ్ విజయవాడ టూర్ షెడ్యూల్ ఖరారైనప్పుడు .. ఆయన వ్యక్తిగతంగా పవన్‌తో భేటీ అవుతారని, లేదంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో జరిగే అధికారిక సమావేశంలో డిప్యూటీ సీఎం హోదాలో పవన్ కళ్యాణ్ పాల్గొంటారని జోరుగా ప్రచారం జరిగింది. తీరా చూస్తే, చంద్రబాబుతో జరిగిన జల చర్చల్లో గానీ, పున్నమి ఘాట్ వద్ద జరిగిన విజయవాడ ఉత్సవ్ 2.0 వేదికపై గానీ పవన్ అస్సలు కనిపించలేదు.పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రి వచ్చినప్పుడు.. అదీ సినిమా రంగంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించి రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఒక స్టార్ లీడర్ ఏపీకి విచ్చేసిన వేళ, అదే సినీ నేపథ్యం, ప్రజాదరణ ఉన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా అధికారిక కార్యక్రమాల్లో భాగస్వామి అయి ఉంటే హుందాగా ఉండేదన్న అభిప్రాయం సాధారణ ప్రజల్లో, అభిమానుల్లో వ్యక్తమైంది. పైగా విజయవాడ నడిబొడ్డున జరిగే సాంస్కృతిక వేడుకలకు ఉప ముఖ్యమంత్రి హాజరు కాకపోవడం వెనుక ఏదైనా ప్రోటోకాల్ సమస్య ఉందా లేక రాజకీయ కారణాలు ఉన్నాయా అన్న ప్రశ్నలు సోషల్ మీడియాలో వెల్లువెత్తాయి. ఏపీ సర్కార్ తరఫున మున్సిపల్ మంత్రి నారాయణ, ఇతర అధికారులు ముందుండి కార్యక్రమాలను నడిపించారే తప్ప, పవన్ అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు.పవన్ కళ్యాణ్ ఈ పర్యటనకు కావాలనే దూరంగా ఉండటం వెనుక ఒక బలమైన రాజకీయ, ఆత్మగౌరవ కోణం దాగి ఉందని జనసేన వర్గాలు చెబుతున్నాయి.

# బుమ్రా స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు.. కానీ మా దగ్గర ప్రతిభ ఉంది: సంజూ శాంసన్

- బుమ్రా లాంటి బౌలర్‌కు ప్రత్యామ్నాయం లేదని చెప్పిన సంజూ శాంసన్
- యువ బౌలర్లు అర్ష్‌దీప్, ప్రిన్స్ యాదవ్‌లను ప్రశంసించిన వికెట్ కీపర్
- అద్భుతంగా ఆడుతున్న షాయ్ హోప్‌ను గౌరవించాల్సిందేనని వ్యాఖ్య
- తిలక్ వర్మ ఔట్ కావడమే మ్యాచ్‌లో కీలక మలుపు అని వెల్లడి
- ఓపెనర్లు ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మలకు మద్దతుగా నిలిచిన శాంసన్



హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో వెస్టిండీస్‌తో జరిగిన నాలుగో టీ20 మ్యాచ్‌లో భారత జట్టు 24 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ఈ ఓటమి అనంతరం వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశాడు. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని, ఆయన లేని లోటు బౌలింగ్ విభాగంలో స్పష్టంగా కనిపిస్తోందని అంగీకరించాడు.ఆసియా క్రీడల తర్వాత వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా బుమ్రాకు ఈ సిరీస్ నుంచి విశ్రాంతి ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై శాంసన్ మాట్లాడుతూ.. "జస్‌ప్రీత్ బుమ్రా ఒక తరం గర్వించదగ్గ బౌలర్. అలాంటి ఆటగాడు జట్టులో ఉండటం మన అదృష్టం. ఆయనకు ప్రత్యామ్నాయం ఉండదు. కానీ, మన జట్టులోకి మంచి ప్రతిభ ఉన్న యువ ఆటగాళు వస్తున్నారు. అర్ష్‌దీప్ సింగ్ అద్భుతంగా రాణిస్తున్నాడు. అలాగే గత కొన్ని మ్యాచ్‌లలో ప్రిన్స్ యాదవ్ కూడా ఆకట్టుకుంటున్నాడు. వారికి మనం ఎంత ఎక్కువ అవకాశాలు ఇచ్చి ప్రోత్సహిస్తే, వారు అంతగా రాటుదేలుతారు" అని వివరించాడు. బ్యాటింగ్ చేస్తూ గాయపడిన అర్ష్‌దీప్ గురించి మాట్లాడుతూ.. "అతను భుజానికి ఐస్ పెట్టుకుంటున్నాడు. త్వరగా కోలుకుంటాడని ఆశిస్తున్నాను" అని తెలిపాడు.వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ అద్భుత ఫామ్‌ను శాంసన్ ప్రశంసించాడు. "హోప్ చాలా బాగా ఆడుతున్నాడు. అతని ఆటను మనం గౌరవించాలి. పెద్దగా రిస్క్ తీసుకోకుండా, మంచి క్రికెటింగ్ షాట్లతో బౌలర్లను గౌరవిస్తూ పరుగులు చేస్తున్నాడు. అతడి బ్యాటింగ్‌కు కచ్చితంగా క్రెడిట్ ఇవ్వాలి. ప్రతి మ్యాచ్‌లో అతడిని ఎలా ఎదుర్కోవాలనే దానిపై మేం దృష్టి సారిస్తున్నాం" అని పేర్కొన్నాడు.

ఈ మ్యాచ్‌లో ఓటమికి గల కారణాలను విశ్లేషిస్తూ.. 17వ ఓవర్‌లో తిలక్ వర్మ ఔట్ కావడమే కీలక మలుపు అని శాంసన్ అభిప్రాయపడ్డాడు. "తిలక్ ఔట్ అయ్యే వరకు మేం లక్ష్య ఛేదనలో సరైన మార్గంలోనే ఉన్నాం. ఓవర్‌కు 10-12 పరుగులు సులభంగా రాబడుతున్నాం. ఒత్తిడిలోనూ నితీశ్ రెడ్డి, తిలక్ వర్మ అద్భుతంగా ఆడారు" అని కొనియాడాడు.

ఇదే సమయంలో ఫామ్ కోల్పోయిన ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మలకు అండగా నిలిచాడు. "ఇషాన్, అభిషేక్ ప్రపంచంలోనే అత్యుత్తమ ఓపెనర్లు. ఒక మ్యాచ్‌లో విఫలమైనంత మాత్రాన ఆందోళన అవసరం లేదు. గత మ్యాచ్‌లోనే అభిషేక్ మంచి ఇన్నింగ్స్ ఆడాడు. ఇషాన్ నిలకడగా రాణిస్తున్నాడు" అని వారికి మద్దతుగా నిలిచాడు.

# ఈ చెత్త బౌలింగ్‌తో మనం వరల్డ్‌కప్ గెలవడం చాలా కష్టం.. మాజీ క్రికెటర్ వ్యాఖ్యలు వైరల్







హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన నాలుగో టీ20లో భారత జట్టు 24 పరుగుల తేడాతో ఓడిపోయిన సంగతి తెలిసిందే. విండీస్ నిర్దేశించిన 247 రన్స్ లక్ష్య ఛేదనలో టీమిండియా ఘోరంగా తడబడింది. ఈ నేపథ్యంలో ఇండియన్ బౌలర్ల ప్రదర్శనపై మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రస్తుత బౌలింగ్ కాంబినేషన్‌తో భారత్ ఐసీసీ ప్రపంచకప్ గెలవడం చానా కష్టమని తేల్చి చెప్పేశాడు.

**బౌలర్ల వైఫల్యమే భారత్ కొంపముంచింది:**

మాజీ క్రికెటర్ కైఫ్ మీడియాతో మాట్లాడుతూ.. హైదరాబాద్ మ్యాచ్‌లో భారత్ ఓటమికి ప్రధాన కారణం బౌలింగ్ వైఫల్యమే.. బౌలర్లు భారీగా పరుగులు సమర్పించారు. 247 రన్స్ ఇవ్వడమంటే మాములు విషయం కాదు. ఇదే తొలిసారి కాదు, అంతకుముందు కూడా 250ం టార్గెట్‌ను కాపాడుకోవడంలో భారత బౌలర్లు ఘోరంగా విఫలమయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో బ్యాటర్లు 3 మ్యాచ్‌లు గెలిపిస్తే.. మిగతా రెండింటిని బౌలర్లు ఓడించారు. ఇలాంటి కాంబినేషన్‌తో ప్రపంచకప్ నెగ్గడం అసాధ్యం అని కైఫ్ హెచ్చరించారు.

**2024 ప్రపంచకప్ విజయంతో పోలిక:**

2024 టీ20 ప్రపంచకప్ విజయంలో జట్టులోని ప్రతి ఒక్కరూ భాగస్వామిగా నిలిచారు అని మహమ్మద్ కైఫ్ గుర్తు చేశారు. జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ లాంటి బౌలర్లతో పాటు బ్యాటర్లు సత్తా చాటారని పేర్కొన్నాడు. ఇక నాలుగో టీ20లో ఓపెనర్ అభిషేక్ శర్మ నెమ్మదిగా ఆడాడంటూ వస్తున్న విమర్శలపై స్పందిస్తూ.. ప్రతి బ్యాటర్ అన్ని రోజులూ అద్భుతంగా ఆడటం కష్టమని, సంజు శాంసన్ మాత్రం జట్టుకు అదిరిపోయే ఆరంభాన్ని అందించాడని కైఫ్ అభిప్రాయపడ్డారు.

# యువ క్రికెటర్లను యువరాజ్ ఎలా తిట్టేవాడో తెలుసా.. పాత రోజులని గుర్తు చేసుకున్న రోహిత్



భారత క్రికెట్ చరిత్రలోనే డ్రెస్సింగ్ రూమ్ ముచ్చట్లు ఎప్పుడూ అత్యంత ఆసక్తికరంగా ఉంటాయి. భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న 'ఫ్యామిలీ ఫుల్ హౌస్ విత్ రోహిత్ శర్మ' షో ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. సహచర ఆటగాళ్ల వ్యక్తిత్వాలపై హిట్‌మ్యాన్ చేసిన వ్యాఖ్యలు ఒకవైపు నవ్విస్తూనే, మరోవైపు భారత క్రికెట్‌లోని క్రమశిక్షణ, సీనియర్-జూనియర్ అనుబంధాలను కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నాయి. ఇండియన్ ప్లేయర్స్ క్రికెటర్లు కాకపోయి ఉంటే ఏ ప్రొఫెషన్ సెలక్ట్ చేసుకునేవారనే ప్రశ్నకు రోహిత్ ఇచ్చిన ఆన్సర్ ఇప్పుడు ఫ్యాన్స్ ని ఆకట్టుకుంటుంది.

**జస్ప్రీత్ బుమ్రా డాక్టర్ అయ్యేవాడు:**

బాలీవుడ్ స్టార్ కమెడియన్ కృష్ణ అభిషేక్ అడిగిన ప్రశ్నకు రోహిత్ శర్మ స్పందిస్తూ.. ప్రపంచ నంబర్ వన్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. బుమ్రా గనుక క్రికెటర్ కాకపోతే ఖచ్చితంగా డాక్టర్ అయ్యేవాడని చెప్పాడు. మైదానంలో మ్యాచ్ చివర్లో చావు బతుకుల మధ్య పోరాడుతున్న సమయంలో, బౌలింగ్ కి వచ్చి ప్రత్యర్థి నుంచి మ్యాచ్‌ను కాపాడే ప్రాణదాతలా బుమ్రా నిలుస్తాడని కొనియాడాడు. ఆ ఒత్తిడిని జయించి మ్యాచ్‌ను గెలిపించడం అందరికీ సాధ్యమయ్యే పని కాదని హిట్ మ్యాన్ తేల్చి చెప్పాడు.

**యంగ్ క్రికెటర్లని యువీ ఘోరంగా తిట్టేవాడు:**

మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్‌ను రోహిత్ శర్మ 'హెడ్‌మాస్టర్' తో పోల్చాడు. 2006, 2007 కాలంలో తాము కొత్తగా జట్టులోకి వచ్చినప్పుడు యువీ భాయ్ ఒక కఠినమైన హెడ్‌మాస్టర్‌లా వ్యవహరించేవాడని గుర్తు చేసుకున్నాడు. డ్రెస్సింగ్ రూమ్‌లో క్రమశిక్షణ విషయంలో జూనియర్లను బాగా తిట్టేవాడని, అయితే ఆ తిట్ల వెనుక ఎంతో ఆప్యాయత, ప్రేమ దాగి ఉండేవని పేర్కొన్నాడు. ఆరంభంలో సీనియర్లతో ఆడుతున్నప్పుడు ఉన్న భయం, బెరుకును పోగొట్టి, తమను పూర్తి కంఫర్టబుల్‌గా మార్చడంలో యువరాజ్ పాత్ర మరువలేనిదని రోహిత్ భావోద్వేగంగా చెప్పుకొచ్చాడు.ఇక రిషభ్ పంత్‌ను రోహిత్ పర్ఫెక్ట్ 'బేబీ సిట్టర్' గా అభివర్ణించాడు. విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు ఆటగాళ్ల కుటుంబాలు, పిల్లలు మాతో వచ్చేవాళ్లని.. ప్రాక్టీస్ పూర్తయిన వెంటనే పంత్ పిల్లలతో గడిపేవాడు. ఆస్ట్రేలియా పర్యటనలో అప్పటి కెప్టెన్ టిమ్ పైన్ 'బేబీ సిట్టర్' అని పిలవడానికి అసలు ముచ్చట ఇదే.. అయితే పిల్లలతో అంత ప్రేమగా ఆడుకుంటూనే, సరదాగా వారి ప్లేట్లలోని ఫుడ్ లాక్కుని తినేసేవాడని, దాంతో ఆ పిల్లలు రిషభ్ పంత్ ని చూసి చిరాకు పడేవారంటూ డ్రెస్సింగ్ రూమ్ ముచ్చట్లను రోహిత్ శర్మ నవ్వులు పూయిస్తూ పంచుకున్నాడు.



# ఒకే మూడ్.. ఒకే టెంప్లేట్.. బన్నీ సినిమాకు మొదట్లోనే ట్విస్ట్!





టాలీవుడ్ లో ఇప్పుడు కొత్త సమస్య మొదలైంది. ఏ పెద్ద సినిమా చూసినా ఒకే తరహా టెంప్లేట్, ఒకే మూడ్ కనిపిస్తోంది. హీరోలందరూ తెరపై సరికొత్తగా కనిపించాలని తాపత్రయపడుతున్నప్పటికీ.. చివరికి అందరూ ఒకే రకమైన డార్క్, రస్టిక్ ప్రపంచాల్లోకే అడుగుపెడుతున్నారు. బాక్సాఫీస్ దగ్గర ఏదో ఒక సినిమా క్లిక్ అవ్వగానే, మిగిలిన డైరెక్టర్లంతా తమ హీరోలను కూడా అదే మూస ధోరణిలోకి నెట్టేస్తున్నారనే చర్చ ఇప్పుడు ఫిల్మ్ సర్కిల్స్ లో జోరుగా సాగుతోంది.

శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్ లో నాని చేసిన 'ది ప్యారడైజ్', బుచ్చిబాబు దర్శకత్వంలో రామ్ చరణ్ నటించిన 'పెద్ది' ప్రాజెక్టుల విషయంలో ఈ పోలికలు ఎక్కువగా వినిపించాయి. ఈ రెండు భారీ చిత్రాలు రా అండ్ రస్టిక్ నేపథ్యంలో సాగే ఇంటెన్స్ డ్రామాలే. అయితే స్క్రీన్ పై కనిపించే డార్క్ విజువల్స్ నుంచి హీరో ఎలివేషన్లు, హెవీ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ వరకు రెండింటి మధ్య ఉన్న డిఫరెన్స్ చూసి.. ఇవి రెండూ ఒకే ఫార్మాట్ లో అటు ఇటు తిప్పి తీసినట్లు ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.స్టార్టింగులో ఇలాంటి రస్టిక్ అవతారాలు, రక్తపాతం ఆడియన్స్ కు కాస్త థ్రిల్ ఇచ్చాయి. కానీ వరుసగా ప్రతి స్టార్ హీరో అదే మట్టి గెటప్, అదే గ్యాంగ్ స్టర్ నేపథ్యంతో వస్తుంటే థియేటర్లలో ఫ్రెష్ నెస్ పూర్తిగా దెబ్బతింటోంది. సినిమా టైటిల్ మారినా చూసే విజువల్స్ లో తేడా లేకపోవడంతో ఆడియన్స్ లో క్రమంగా విసుగు మొదలవుతోంది. క్రియేటివిటీ అంటే స్క్రీన్ మొత్తం నలుపు, ఎరుపు రంగులతో నింపేయడం కాదనే విమర్శలు ఇండస్ట్రీ వర్గాల నుంచే వస్తున్నాయి.ఈ రొటీన్ ఫార్ములా సెగ ఇప్పుడు అల్లు అర్జున్ లోకేష్ కనగరాజ్ ప్రాజెక్ట్ ూూ23 కు కూడా తగిలింది. ఈ క్రేజీ కాంబినేషన్ సెట్ అవ్వగానే బన్నీ లుక్ కోసం ముంబైలో ప్రత్యేకంగా ఒక లుక్ టెస్ట్ వీడియోను షూట్ చేశారట. ఆ వీడియోతోనే సినిమాకు సంబంధించిన ఫస్ట్ ఇంపాక్ట్ ఇవ్వాలని మేకర్స్ ప్లాన్ చేశారు. అయితే సరిగ్గా అదే టైమ్ లో మరో స్టార్ హీరో గ్యాంగ్ స్టర్ మూవీ నుంచి అచ్చం అలాంటి డార్క్ టోన్ తో ఉన్న ప్రమోషనల్ వీడియో బయటకు వచ్చింది.వేరే సినిమా వీడియోతో తమ కాన్సెప్ట్ సింక్ అవుతుండటాన్ని గమనించిన ూూ23 టీమ్ వెంటనే అప్రమత్తమైంది. ఇప్పుడు తాము ఆ వీడియోను రిలీజ్ చేస్తే వేరే సినిమాను కాపీ కొట్టినట్లు ఉంటుందనే ఉద్దేశంతో, తమ పాత ప్రమోషనల్ ప్లాన్ ను ప్రస్తుతానికి పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. తమ లుక్ టెస్ట్ ను మళ్లీ కొత్తగా ఎలా డిజైన్ చేయాలనే దానిపై లోకేష్ టీమ్ పునరాలోచనలో పడింది. ఒకే ట్రెండ్ ను అందరూ ఫాలో అవ్వడం వల్ల మొదట్లోనే ఇలాంటి సమస్యలు ఎదురవుతున్నాయి.తెలుగు సినిమాకు అసలైన బలం వైవిధ్యమైన కథలను, లోతైన ఎమోషన్లను చూపించడమే. ఒక హీరోకు లేదా ఒక దర్శకుడికి వర్కౌట్ అయిన స్టైల్ ఇండస్ట్రీలో అందరికీ సెట్ అవుతుందనే గ్యారెంటీ ఉండదు. ప్రతి ప్రాజెక్ట్ కు ఒక విలక్షణమైన ఐడెంటిటీ ఉన్నప్పుడే ప్రేక్షకులు ఆసక్తి చూపిస్తారు. పాత సక్సెస్ ఫార్ములాలను జిరాక్స్ తీయడం మానేసి, రూట్ మార్చి కొత్త ఐడియాలతో వస్తేనే దర్శకులకు బాక్సాఫీస్ దగ్గర లాంగ్ రన్ ఉంటుంది.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965